నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
బుధవారం | ఏప్రిల్ 24, 2024 | www.navatelangana.com

చలివేంద్రం ఏర్పాటు

నవతెలంగాణ - కాగజ్‌నగర్

పట్టణ బస్టాండ్‌లో స్పర్శ ఫౌండేషన్ సిర్పూర్ పేపర్ మిల్లు ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజల సౌకర్యార్థం చలివేంద్రలు ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పేపర్ మిల్లు ప్రతినిధులు నాగేశ్వరరావు, రీణ బివాల్, తుమ్మ రమేష్, జమషడ్ అలీ, కంట్రోలర్ అశ్రఫ్ అలీ పాల్గొన్నారు.



గోదాంలో సీఎంఆర్ నిల్వలు పరిశీలించిన కలెక్టర్

నవతెలంగాణ-లక్ష్మణచాంద

జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మంగళవారం మండలంలోని బోరిగాం గోదాన్ని పరిశీలించారు. సిఎంఆర్ డంపింగ్‌ను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. డంపింగ్ ప్రక్రియను వేగవంతం చేయడానికి కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. రోజువారీ కూలీల సంఖ్య, డంపింగ్ వివరాల రిపోర్టులను పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, పౌర సరఫరాల శాఖ డీఎం శ్రీకళ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సంక్షేమం ఏదీ..?

- నిబంధనల పాటించని వ్యాపార, వాణిజ్య సంస్థలు
- కార్మికుల పేరుపై జమచేయని సంక్షేమ నిధి
- అమలుకు నోచుకోని 8గంటల పని విధానం
- వ్యాపార, వాణిజ్య సంస్థల్లో నిబంధనలు బేఖాతరు
- దృష్టి సారించని కార్మికశాఖ

వ్యాపార, వాణిజ్య సంస్థలు కార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలేస్తున్నాయి. వారితో పని చేయించుకుంటున్నా వారి సంక్షేమాన్ని మాత్రం పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా 8గంటల పని విధానాన్ని అనేక సంస్థలు గాలికొదిలేసి కార్మికులతో వెట్టి చాకిరి చేస్తున్నారు. ముఖ్యంగా ఆయా సంస్థల్లో పనిచేసే కార్మికుల పేరుపై సంక్షేమ నిధి జమ చేయాల్సి ఉన్నప్పటికీ.. అలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఫలితంగా సంక్షేమ బోర్డు నుంచి కార్మికులకు దక్కాల్సిన ప్రయోజనాలు దూరమవ్వాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. ఆయా దుకాణాలు, సంస్థల్లో నిరంతరం తనిఖీలు చేపడుతూ కార్మికుల సంక్షేమాన్ని పరిరక్షించాల్సిన కార్మికశాఖ అధికారులు ఆ దిశగా దృష్టి సారించడం లేదు. ఆయా సంస్థల యజమానులు నిబంధనలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నా ఆ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాల కారణంగా కార్మికశాఖ తనిఖీలు చేపట్టడం లేదనే ఆరోపణలున్నాయి.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఏ వ్యాపారమైనా.. వాణిజ్యమైనా విస్తరించాలన్నా..అభివృద్ధి చెందాలన్నా అందులో కార్మికుల శ్రమ తప్పనిసరిగా ఉంటుంది. కార్మికుడు లేనిదే ఏ యంత్రమూ పనిచేయని పరిస్థితి. సంపదకు మూల కారకులైన కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వాలు పూర్తిగా విస్మరిస్తున్నాయి. ముఖ్యంగా ఆయా దుకాణాలు, వ్యాపార, వాణిజ్య సంస్థల్లో అనేక మంది కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. వేలాది కార్మికులు అరకొర వేతనాలతో పరిశ్రమలు, దుకాణాలు, వాణిజ్య సంస్థల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా సంక్షేమబోర్డును ఏర్పాటుచేసింది. ప్రతి ఏటా నవంబర్‌లో ఆయా దుకాణ యజమానులు వారి వద్ద పనిచేస్తున్న పని చేస్తున్న కార్మికులకు బోర్డుకు సంక్షేమ నిధి జమ చేయాల్సి ఉంటుంది. యజమాని వాటా రూ.5, కార్మికుడి వాటా రూ.2లు కలిపి రూ.7చొప్పున సంక్షేమ నిధి చెల్లించాలి. ఇలా చెల్లిస్తే కార్మికుల కూతురి పెళ్లి చేస్తే రూ.15వేల ఆర్థిక సాయంతో పాటు పదో తరగతి దాటిన తర్వాత వారి పిల్లలకు స్కాలర్‌షిప్ రావడంతో ప్రమాదవశాత్తు లేదంటే అనారోగ్యం కారణంగా మరణిస్తే దహన సంస్కారాలకు రూ. 15వేలు చెల్లిస్తుంది. ఏదైనా అనారోగ్యంతో ఆపరేషన్ జరిగితే ప్రభుత్వం అవసరమైన ఆర్థిక సాయం అందిస్తుంది. గతంలో ఆయా దుకాణ యజమానులు కార్మికుల పక్షాన సంక్షేమ నిధిని జమ చేసేవారు. కానీ కొన్నేండ్ల నుంచి పూర్తిగా విస్మరించడంతో కార్మికులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రయోజనాలు దక్కడం లేదు.

నిబంధనలు బేఖాతరు..!

కార్మికుల సంక్షేమం కోసం ఆ శాఖ రూపొందించిన నిబంధనలు అమలుకు నోచుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో సుమారు 1300 దుకాణాలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు ఉండగా వీటి పరిధిలో సుమారు 5వేల మంది కార్మికుల పనిచేస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో సుమారు 20వేల మంది వరకు పనిచేస్తున్నారు. కానీ యజమానుల నిర్లక్ష్యం..కార్మికశాఖ అలసత్వం కారణంగా కార్మికులకు దక్కాల్సిన ప్రయోజనాలు దూరమవుతున్నాయనే విమర్శలున్నాయి. కచ్చితంగా 8గంటల పని విధానం అమలు చేయాల్సి ఉన్నప్పటికీ చాలా సంస్థల్లో ఈ నిబంధన అమలు కావడం లేదు. కొన్ని సంస్థలు మినహా అనేక సంస్థలు ఉదయం 9గంటల నుంచి రాత్రి 9గంటల వరకు వారితో పనిచేయించుకుంటున్నారు. వారంలో ఒక రోజు సెలవు తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉంటుంది. సెలవు రోజు పనిచేస్తే కార్మికుడికి ఆ రోజున ఇవ్వాల్సిన వేతనంతో పాటు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఇది ఎక్కడా అమలు కావడం లేదనే పలువురు కార్మికులు చెబుతున్నారు. ముఖ్యంగా కొన్ని సంస్థల్లో కనీసం కూర్చోవడానికి కుర్చీలు కూడా ఉండవు. విధుల్లో హాజరైనప్పటి నుంచి సెలవు అయ్యే వరకు నిలబడి పనిచేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కార్మికశాఖ అధికారులు తనిఖీలు చేపడుతూ నిబంధనలపై ఆరా తీసేవారు. కానీ తెలంగాణ ప్రభుత్వం ఈజీ డూయింగ్ బిజినెస్ అమలు చేస్తున్న కారణంగా ఆ శాఖ తనిఖీలు చేయడం మానేసిందనే విమర్శలు వస్తున్నాయి. కార్మికశాఖ కమిషనరేట్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకే తనిఖీలు చేయాల్సి ఉంటుంది తప్పితే తమకు తాము తనిఖీలు చేపట్టే విధానం లేదని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఇలాంటి విధానాల కారణంగా కార్మికులు నష్టపోవాల్సి వస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



కొడుకును బస్ ఎక్కించేందుకు వెళ్లి తండ్రి మృతి

నవతెలంగాణ-మంచిర్యాల



కొడుకును హైదరాబాద్ పట్టణానికి బస్సు ఎక్కించేందుకు వెళ్లి న తండ్రి మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి 11 గంటల సమయంలో పట్టణంలో జరిగింది. పట్టణ ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం..శ్రీశ్రీ నగర్‌కు చెందిన కాజీపేట శ్రీనివాస్(52) కొడుకును హైదరాబాద్ బస్సు ఎక్కించి తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో సున్నం బట్టి ఫ్లైఓవర్ దిగుతున్న సమయంలో వెనుక నుండి వస్తున్న స్విఫ్ట్ వాహనం ఢీకొని కింద పడ్డాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు 108 వాహనంలో మంచిర్యాల ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం డాక్టర్ సూచనల మేరకు అంబులెన్సులో కరీంనగర్ తరలించే క్రమంలో పెద్దపల్లి సమీపంలో మృతి చెందాడు. ఈయన మంథనిలోని చందనాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య శిరీష బెల్లంపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తోంది. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఘనంగా కైతల ఎన్నీల

నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల పట్టణంలోని గౌతమీనగర్‌లోని పాయిలి మల్లయ్య ఇంటివద్దు ప్రముఖ కవి నాగవర్మ ముత్యం అతిథ్యంలో కైతల ఎన్నీల కార్యక్రమం ఘనంగా జరిగింది. తెరవే అధ్యక్షుడు తోకల రాజేశం అధ్యక్షతన జరిగిన సమావేశంలో మొదట లేదళ్ల రాజేశ్వరరావు కవితాసంకలనం 'అమ్మకు ఒక జత చెప్పులు కొనాలి' మీద నాగవర్మ ముత్యం సమీక్షా ప్రసంగం చేశారు. మనసులో మెదిలే ఆలోచనలను చెప్పలేక ఉండలేని పరిస్థితుల్లో కవిత్వం రాసే కవి రాజేశ్వరరావు అని తెలిపారు. సాంద్రత నిండిన లేదాల్ల రాజేశ్వరరావు కవిత్వం పాఠకులకు గొప్ప అనుభూతిని మిగిలిస్తుందన్నారు. అనేకానేక చిన్న చిన్న వస్తువులకు గొప్ప కవిత్వ రూపం ఇచ్చారని తెలిపారు. అనంతరం కవి సమ్మేళనం నిర్వహించారు. ప్రస్తుత సామాజిక పరిస్థితుల నేపథ్యంలో కవులు రాసిన కవిత్వం అందరినీ ఆలోచింపజేసింది. ఈ కార్యక్రమంలో లేదాళ్ల రాజేశ్వరరావు, తోటపల్లి భూమన్న, అల్లాడి శ్రీనివాస్, చక్రవర్తుల శ్రీమన్నారాయణ, తుమ్మల లక్ష్మారెడ్డి, కడారు రవికుమార్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారాలకు అనుమతి తప్పనిసరి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ప్రచారాలకు సంబంధించి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ(ఎంసిఎంసి) ద్వారా అనుమతి తీసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాజర్షి షా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎలాక్ట్రానిక్, సోషల్ మీడియాలలో ప్రచారాలకు సంబంధించి ముందస్తుగా ఎంసిఎంసి అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా, కేబుల్స్, మొబైల్ నెట్‌వర్క్ మొదలైనవి ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటనల పర్యవేక్షణ కమిటీ ధ్రువీకరణ తర్వాత మాత్రమే ప్రసారం చేయాలని పేర్కొన్నారు. అనుమతి తీసుకోకుండా ప్రసారం చేస్తే అభ్యర్థిపై ఐపీసీ సెక్షన్ 171హెచ్ ప్రకారం ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన జరిగినట్లు భావించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఈదురు గాలులకు నేలమట్టమైన వరిపంట



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం రాత్రి ఈదురుగాలులతో కురిసిన వర్షానికి వరి నేల మట్టమైంది. మండలంలోని గొల్లగూడ, నామానగర్, గువ్వలగూడ, జంబుగా, నాగంపేట, గజ్జిగూడ గ్రామాల్లో కంకి దశలో ఉన్న యాసంగి వరి నేల మట్టమైంది. గువ్వలగూడ గ్రామానికి చెందిన ఠాకూర్ నాగేందర్‌సింగ్ 18 ఎకరాల్లో వేసిన యాసంగి వరి పంటకు కొంత నష్టం వాటిల్లింది.

వ్యాధి తీవ్రత అధికమైతే రిమ్స్‌కు రెఫర్ చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహిళలకు ఏదైన వ్యాధి తీవ్రత అధికంగా ఉంటే రిమ్స్‌కు రెఫర్ చేయాలని డిఎంహెచ్ఓ రాథోడ్ నరేందర్ సూచించారు. మంగళవారం స్థానిక హమాలివాడ పీహెచ్‌సీలో ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రోగుల వివరాలను నమోదు చేసే దస్త్రాలను, సిబ్బంది పనితీరును పరిశీలించి మెరుగైన సేవలు అందించడానికి సూచనలు చేశారు. మహిళలకు అన్ని రకాల పరీక్షలు చేసి అవసరమైన చికిత్సలు అందించాలన్నారు.

మైనార్టీ గురుకుల పాఠశాల వాచ్‌మెన్ విధుల నుండి తొలగింపు

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలోని బెల్లంపల్లి మైనార్టీ గురుకుల పాఠశాల వాచ్‌మెన్(సెక్యూరిటీ గార్డ్) ఎండి.నిహాల్ను మైనార్టీ గురుకుల కార్యదర్శి ఆదేశాల మేరకు విధుల నుండి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశామని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలో నెలకొన్న ఘటనపై వాచ్‌మెన్‌ను విధుల నుండి తొలగించడంతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయునికి షోకాజ్ నోటీసు జారీ చేశామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వర్షాకాలానికి ముందుగా విద్యుత్ లైన్‌ల చెకింగ్‌లో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని పలు కాలనీలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ సదాశివ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు బజార్‌వాడి, పైకాజినగర్, సందీప్‌నగర్, బజార్‌వాడి మెయిన్ రోడ్డు, బస్టాండ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

వన్య ప్రాణుల సంరక్షణ బాధ్యతగా తీసుకోవాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో వన్యప్రాణుల సంరక్షణ బాధ్యతగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. మంగళవారం కవ్వాల్ టైగర్ రిజర్వ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, ఫీల్డ్ డైరెక్టర్ ఆఫ్ ఫారెస్ట్ ఎస్.శాంతారామ్, జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) బి.రాహుల్, మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల అటవీ అధికారులు శివ్‌ఆశిష్ సింగ్, నీరజ్‌కుమార్, డబ్ల్యు.డబ్ల్యు.ఎఫ్ ల్యాండ్స్కప్ జాతీయ సమన్వయకర్త భూమినాథన్, ఏనుగుల ప్రత్యేక కన్జర్వేషన్ నవనీథన్, పశ్చిమబెంగాల్ డబ్ల్యు.డబ్ల్యు.ఎఫ్ అసిస్టెంట్ మేనేజర్ కుల్దీప్‌తో కలిసి పోలీసు, అటవీ, రెవెన్యూ, విద్యుత్, పంచాయతీ, పశు సంవర్ధక, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, ఎంపీడీలు, పంచాయతీ కార్యదర్శులతో వన్యప్రాణులు, మానవుల సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వన్యప్రాణులతో పాటు మానవ జీవితాల సంరక్షణ బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. ఏనుగుల ఆవాసాలు గుర్తించాలని, ఏనుగుల జనావాసాలలోకి రాకుండా రక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ఏనుగులు అటవీ ప్రాంతాలలోనే ఉండే విధంగా తాగునీరు, ఆహారం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం జరిగిందని, ఇందులో భాగంగా అడవిలో ఆక్రమణకు గురైన అటవీ భూప్రాంతాన్ని స్వాధీనపర్చుకొని, వన్యప్రాణులకు ఆహారం అందించే విధంగా పండ్ల మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఏనుగులు జనావాసాలలో వచ్చినప్పుడు తీసుకోవలసిన చర్యలు, పాటించవలసిన జాగ్రత్తలు, ప్రవర్తనా తీరుపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అటవీ సమీప గ్రామాలలో చోటు చేసుకునే తక్షణ చర్యలపై స్థానిక ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని, అవాంఛనీయ ఘటనలు జరుగకుండా తక్షణ చర్యలలో భాగంగా 144 సెక్షన్ అమలు చేసే విధంగా చూడాలని తెలిపారు. దట్టమైన అటవీ ప్రాంతంలో తక్కువ సంఖ్యలో ఉన్న నివాసాలను ఆయా కుటుంబ సభ్యులతో మాట్లాడి తరలించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అటవీ ప్రాంతాలలో వన్యప్రాణుల రక్షణలో భాగంగా భద్రతా వాహనాలు, డ్రోన్లు, నైట్ విజన్ పరికరాల ద్వారా వన్యప్రాణుల కదలికలను గుర్తించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, సంబంధిత నివేదికలను ట్రాకింగ్ సెల్కు పంపించడం జరుగుతుందని తెలిపారు.

నైపుణ్యాభివృద్ధికి సెలవులను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా సమన్వయ అధికారి కటుకం మధుకర్



నవతెలంగాణ - కాగజ్‌నగర్

విద్యార్థులు తమలోని నైపుణ్యాభివృద్ధికి వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సమన్వయ అధికారి కటుకం మధుకర్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని జెడ్పీ బాయ్స్, గర్ల్స్, మండలంలోని అంకుసాపూర్, వంజీరి ఎంపీయూపీఎస్ పాఠశాలల్లో నిర్వహించిన విద్యార్థులు, ఉపాధ్యాయుల సమావేశాల్లో పాల్గొన్నారు. విద్యార్థులకు వేసవి సెలవుల్లో చదువుకోవడానికి గ్రంథాలయ పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు సెలవుల్లో పెయింటింగ్, డ్యాన్స్, సంగీతం, పబ్లిక్ స్పీకింగ్ వంటి కొత్త నైపుణ్యాన్ని నేర్చుకోవడం ప్రారంభించాలన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే ఆటలు, క్రీడలు, శారీరక శ్రమ చేయాలన్నారు. కుటుంబ పనుల్లో తల్లిదండ్రులకు సాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వేసవికాలంలో పిల్లల పట్ల జాగ్రత్త వహించాలి



ఆసిఫాబాద్ : వేసవికాలంలో పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. పాఠశాల చివరి రోజు అయిన మంగళవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. వేసవికాలంలో విద్యార్థులకు చదువుకు సంబంధించిన పలు అంశాలపై తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. పాఠశాల నుండి వారికి రోజువారీగా చేయాల్సిన ఇంటి పని అందించడం జరిగిందని, దాన్ని చేసేలా చూడాలన్నారు. తిరిగి పాఠశాల ప్రారంభమైన నాటికి వారి ఇంటి పని అయ్యేలా తల్లిదండ్రులు చూడాల్సిన బాధ్యత ఉంటుందన్నారు. వేసవిలో ఎక్కువగా ఎండకు తిరగకుండా చూడాలని సూచించారు. తల్లిదండ్రుల నుండి పలు సూచనలు సలహాలు స్వీకరించారు. వాటి అమలు కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకర్, సైఫుల్లాఖాన్, రమేష్, సంపత్, మహేష్, రాకేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

నోడల్ అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో విధులు కేటాయించబడిన నోడల్ అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్‌రావుతో కలిసి నోడల్ అధికారులతో ఎన్నికల ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ కొరకు ఫ్లయింగ్, స్టాటిక్ సర్వేయలెన్స్, వీడియో సర్వేయలెన్స్, వీడియో పరిశీలన, సహాయ ఖర్చుల పరిశీలకులు, అకౌంటింగ్ బృందాలు, ఎంసిఎంసి, కంట్రోల్ రూమ్, ఖర్చుల పర్యవేక్షణ కమిటీలు, ఎన్నికల సంబంధిత విభాగాల అధికారులతో పాటు అదనపు సిబ్బందిని నియమించడం జరుగుతుందన్నారు. నోడల్ అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కృషి చేయాలని తెలిపారు. జిల్లాలోని అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా అధికారులు ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణ కొరకు జిల్లాలోని పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ నెల 24, 25 తేదీలలో ఆదిలాబాద్‌లో జరగనున్న సమావేశానికి హాజరు కావాల్సి ఉంటుందని, మే 9 నుండి సెక్టార్ అధికారులకు వాహనాలను కేటాయించడం జరుగుతుందని తెలిపారు. సామాగ్రి నిర్వహణలో భాగంగా ఎన్నికల సామాగ్రి ఫారాలు, బ్యాలెట్ పత్రాలు, చెరగని ఇంక్, ఇతర ఎన్నికల సామాగ్రి సేకరణ, పంపిణీ చేయాలని, రవాణా నిర్వహణలో భాగంగా ఎన్నికలలో ఉపయోగించవలసిన అన్ని రకాల రవాణా అవసరాలు, లభ్యత, కొరత ఏర్పడినప్పుడు ఇతర జిల్లాల నుండి సర్దుబాటు, జిల్లాలో కేటాయింపు చర్యలు తీసుకోవాలని తెలిపారు.



కాంగ్రెస్ హామీలను ప్రజలు నమ్మరు

కాగజ్‌నగర్ : కాంగ్రెస్ హామీలను ప్రజలు నమ్మరని, ఎంపీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెడం నగేష్ గెలుపు ఖాయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు నీటి మూటలుగా మిగిలిపోయాయన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మళ్లీ ప్రజలను తప్పుదారి పట్టించేందుకు, ఎన్నికల్లో రాజకీయ లబ్ది పొందేందుకు ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణం పేరుతో మళ్లీ ప్రజలను నమ్మించి ముంచడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వచ్చే ఎంపీ ఎన్నికల్లో మోడీ నాయకత్వంలో ఎంపీగా నగేష్ గెలవడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు ధోని శ్రీశైలం, గజ్జల లక్ష్మణ్, గణపతి, అశోక్ పాల్గొన్నారు.

గురుకులంలో సీట్లు సాధించిన శ్రీసేవా పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

నవతెలంగాణ-నేరడిగొండ





మండల కేంద్రంలోని శ్రీసేవా పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ముగ్గురు గురుకులంలో సీట్లు సాధించారని ప్రిన్సిపల్ నర్సింగ్‌దాస్ తెలిపారు. ఈ సందర్భంగా మొదటి లిస్టులో ముగ్గురు సీటు సాధించారని అన్నారు. సెకండ్ లిస్టులో మరికొంత మంది విద్యార్థులు సీట్లు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ స్కూల్‌లో చదివే విద్యార్థులకు గురుకులంలో సీటు రావడం సంతోషంగా ఉందన్నారు. గురుకులంలో సీటు వచ్చిన విద్యార్థుల్లో నాలుగో తరగతికి చెందిన ఆత్మారామ్, అపర్ణ, వర్షిత ఉన్నారు.

ఆదిలాబాద్ ఎంపీగా ఆత్రం సుగుణను గెలిపిద్దాం

నవతెలంగాణ-బేల



మే 13న జరిగే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను ఎంపీగా గెలిపించాలని మాజీ జెడ్పీటీసీ రాందాస్ నాక్లే, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వరూర్, కొబ్బాయి గ్రామాల్లో సుగుణను గెలిపించాలని ప్రజలను కోరారు. పేద, బడుగు, బలహీన వర్గాల కోసం ఇప్పటికీ అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చిన కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలోకి రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ మండల అధ్యక్షులు గావండే ఘనశ్యామ్, మాజీ సర్పంచ్‌లు అయ్యూ భారత్, గేడం బాపురావు, యువజన కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు బాపురావు, విశాల్, సీతారాం, నానాజీ, కన్నెరాజు ఉన్నారు.

కారు బోల్తా : ఇద్దరికి గాయాలు



నవతెలంగాణ-కడెం

కారు బోల్తా ఇద్దరికి గాయాలైనా సంఘటన మండలంలోని ధర్మాజీపేట్‌లో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్సై ఎం కృష్ణసాగర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నలిమెల అనిల్ కారును అతి వేగంగా అజాగ్రత్తగా డ్రైవింగ్ చేయడంతో ధర్మాజీపేట్ వద్ద మెయిన్ రోడ్ ప్రక్కనే ఉన్న కరెంట్ పోల్‌ను ఢీ కొట్టి, ప్రక్కనే ఉన్నా టేలషాపులోనికి దుసుకెళ్లగా డ్రైవర్ తలకు స్వల్ప గాయం అయ్యింది. పక్కనే ఉన్న శివానంద్ తలకు స్వల్ప గాయం అయ్యింది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై తగు చర్య తీసుకోవాలని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించిన అధికారులు



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని లింగోజీ తండాలో ఈదురుగాలులతో విద్యుత్ వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో విద్యుత్ శాఖ అధికారులు మంగళవారం మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించామని అనంతయ్య అన్నారు. ఎండ కాలంలో ఈదురు గాలులతో వస్తున్నటువంటి సమస్యలను వెంటనే పరిష్కారం చేస్తున్నామన్నారు. వారి వెంట మాజీ సర్పంచ్ జాదవ్ హరినాయక్, లైన్‌మెన్ లక్ష్మణ్, వెంకటేష్ ఉన్నారు.

జొన్నల కొనుగోళ్లు నిలిపివేత

నవతెలంగాణ-ఉట్నూర్

ఈదురు గాలులు వర్షాలు ఉన్న కారణంగా తేది 23 మంగళవారం నుంచి 26వ తేది శుక్రవారం వరకు, వర్షాల కారణంగా మండలంలోని హస్నాపూర్ మార్కెట్ యార్డ్‌లో జొన్నల కొనుగోళ్లు నిలిపి వేసినట్టు ప్యాక్స్ సీఈఓ మల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు జొన్నలను మార్కెట్ యార్డుకు తీసుకు రావద్దని కోరారు.

రేపు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25న జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడ్డి బోజారెడ్డి, పిరాజేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మిడిల్ అండ్ లాంగ్ డిస్టెన్స్ విభాగంలో పరుగు పోటీలు నిర్వహించబడతాయని పేర్కొన్నారు. అండర్ 14, 16, 18, 20 సంవత్సరాల విభాగంలో బాల బాలికలకు సీనియర్ మహిళలకు, పురుషులకు వేరువేరుగా ఈ పోటీలు నిర్వహించబడతాయని పేర్కొన్నారు. ఆసక్తి అర్హత కలిగిన క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 8 గంటలకు స్టేడియంలో రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 28 నుంచి సూర్యాపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9492136510 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

పాలిసెట్ దరఖాస్తు గడువు పొడిగింపు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రయివేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులలో ప్రవేశాల కోసం నిర్వహించే టీఎస్ పాలిసెట్-2024 ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి గడువును ఈ నెల 28 వరకు పొడిగించినట్టు ఆదిలాబాద్ ప్రభుత్వ సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ భరద్వాజ, ఉట్నూర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, నిర్మల్ కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 22తో గడువు ముగియగా 28తేదీ వరకు అవకాశం కల్పించినట్టు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు, ఇటీవల పరీక్ష రాసిన విద్యార్థుతు పాలిసెట్.ఎస్‌బీటీఈటీ.తెలంగాణ.గావ్.ఇన్ ద్వారా ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పునర్జన్మనిచ్చిన దాతలకు ఘన సన్మానం



నవతెలంగాణ-దిలావర్‌పూర్

గుండె జబ్బుతో బాధపడుతున్న బాలికలను ఆదుకొని ప్రాణదానం చేసిన దాతలను మంగళవారం ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థి బట్టు వైష్ణవికి గుండెలో రంధ్రం పడింది. ప్రాణాపాయ స్థితిలో ఉందని తెలుసుకున్న డాక్టర్ ప్రమోద్ చంద్రారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ఆపరేషన్‌కు సహకరించారు. సర్పంచ్ విరేష్ మిత్రుల సహకారంతో నలబై వేల రూపాయలు అందించాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న పాపకు పునర్జన్మ ఇచ్చిన డాక్టర్ ప్రమోద్ చంద్రారెడ్డి, సర్పంచ్ విరేష్‌లను ప్రాథమిక పాఠశాలలో మంగళవారం పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. విద్యార్థిని తండ్రి బట్టు శ్రీకాంత్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీఎస్ఎస్ ప్రధానోపాధ్యాయులు సదానందం, ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయులు చంద్ర, ఫిజియోథెరపిస్ట్ కిరణ్ కుమార్, హరికృష్ణ, యువకులు అన్వేష్ రెడ్డి, చెల్ల సాయి, షఫీ పాల్గొన్నారు.

కరెంటు రాకా.. తాగు నీళ్లు లేక

- ఐదు రోజులుగా రాని కరెంటు
- మామిడిగూడ వాసులకు అందని తాగునీరు



బావి నుంచి నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్తులు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

గుక్కెడు తాగునీటి కోసం ఆదివాసులు పడుతున్న కష్టాలు ఇవి. అనేక గ్రామాల్లో మిషన్ భగీరథనీరు రాక, కొండ కొనల్లోని వాగులు వంకలు, చెలిమెల నీటినే తాగుతున్నారు. మండలంలోని మారుమూల ఆదివాసీ గ్రామమైన మామిడిగూడ(జి)లో గత ఐదు రోజులుగా కరెంటు రాక గ్రామస్తులు మైళ్ల దూరంలో ఉన్న బావి నుంచి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని గ్రామస్తులు దత్తా తెలిపారు. సుమారు 30 కుటుంబాలు నివసించే ఆ గ్రామానికి మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో గ్రామీణ నీటి పారుదల శాఖ అధికారులు ఫర్లాంగు దూరం ఉన్న బావి నుంచి గ్రామం వరకు సింగల్ ఫేజ్ మోటార్‌ను బిగించారు. బావి నుంచి వచ్చిన నీటికి చిన్న సింటెక్ ట్యాంకులు పంపిణీ చేసే ఏర్పాటు చేశారు. ఐతే గత నాలుగు, ఐదు రోజులుగా కరెంటు రాక పోవడంతో గ్రామస్తులు బిందె వెనుక బిందె పెట్టి పొలిమేరలో ఉన్న బావి నుంచి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు తమ గ్రామానికి కరెంటు సరఫరా చేయాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

- మాజీ మంత్రి జోగు రామన్న
- ఉమ్మడి జిల్లా నాయకుల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి జోగు రామన్న పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపు కోసం చేపట్టాల్సిన కార్యాచరణ, ఎన్నికల ప్రణాళిక ఇతరత్రా అంశాలపై శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో చేపట్టిన సంక్షేమ పథకాల తీరును గుర్తు చేయాలన్నారు. అదేవిధంగా త్వరలోనే మాజీ సీఎం కేసీఆర్ బహిరంగ సభ ఆదిలాబాద్‌లో ఉంటుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కేసీఆర్ పర్యటిస్తున్నారని, ఇందులో భాగంగానే కాగజ్‌నగర్, ఆదిలాబాద్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలు సభను జయప్రదం చేయాలనీ పిలుపునిచ్చారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా అన్ని మండల కేంద్రాల్లో పర్యటిస్తానని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ సభలను విజయవంతం చేయాలనీ సూచించారు. సమావేశంలో ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, అనిల్ జాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో ఆదిలాబాద్‌కు ఒరిగిందేమీ లేదు

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు
- రెండు సెట్ల నామినేషన్ దాఖలు



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాన్ని అందజేస్తున్న ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పదేండ్ల బీజేపీ పాలనలో ఆదిలాబాద్‌కు ఒరిగిందేమి లేదని, నిధులు, అభివృద్ధి జరగాలంటే ప్రశ్నించే గొంతుక పార్లమెంట్లో ఉండాలని, తనను ఆశీర్వాదించాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు కోరారు. మంగళవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, అనిల్ జాదవ్, నాయకులు యూనిస్ అక్బానీతో కలిసి తన తొలిసెట్ నామినేషన్‌ను వేశారు. తన నామపత్రాలను ఎన్నికల ఆర్వో, కలెక్టర్ రాజర్షిషాకు అందించారు. అంతకు ముందు జైనథ్ మండలంలోని పెండల్‌వాడ హనుమాన్ ఆలయంలో పూజలు చేసి ఆదిలాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆత్రం సక్కు మాట్లాడుతూ నాలుగున్నర కోట్ల ప్రజల ఆకాంక్ష మేరకు ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి సుపరిపాలన అందించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్‌దని గుర్తు చేశారు. పదేండ్ల బీజేపీ పాలనలో ఆదిలాబాద్‌కు రావాల్సిన నిధులు, పరిశ్రమలు, రోడ్లు, ఎయిర్‌పోర్టు, యూనివర్సిటి రాలేదన్నారు. కాంగ్రెస్ కూడా అసెంబ్లీ ఎన్నికల్లో అమలు కానీ హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. ఆదిలాబాద్ అభివృద్ధి చెందాలంటే ప్రశ్నించే గొంతుకను పార్లమెంటుకు పంపాలన్నారు. తనను ఎంపీగా అవకాశం ఇస్తే ఆదిలాబాద్‌కు కేంద్రం నుంచి రావాల్సిన అభివృద్ధి నిధులు, ఇతర వాటిని తీసుకువస్తానని భరోసా ఇచ్చారు. ఇదిలా ఉంటే అటూ బీఆర్ఎస్ అభ్యర్థి రెండో సెట్ నామినేషన్‌ను ఎమ్మెల్సీ దండే విఠల్, బీఆర్ఎస్ నాయకులు లోలం శ్యాంసుందర్, జాన్సన్ నాయక్, రాంకిషన్‌రెడ్డి, మర్సుకొల సరస్వతి వేశారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

నవతెలంగాణ-బోథ్



అభివృద్ధి కావాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమని జిల్లా కాంగ్రెస్ నాయకుడు ఏలేటి అశ్విన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని దన్నూర్(బి), కుచులాపూర్, బోథ్ మండల కేంద్రంలోని గడప గడపకు మన కాంగ్రెస్ అనే నినాదంతో ప్రజా యాత్ర ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అలాగే ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క కూడా ధన్నూర్(బి) గ్రామం నుంచి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించి ఆయన గొప్ప నాయకుడిగా ఉన్నాడని అన్నారు. అలాగే దన్నూర్ గ్రామం నుంచి పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం మండల కేంద్రంలో ఇంటింటికి ప్రచారం నిర్వహించి, అనంతరం సంతలో ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, కుర్మె మహేందర్, ఇంద్రారెడ్డి, రమణారెడ్డి, మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

సామాజిక కార్యక్రమాలు అభినందనీయం

- ఘనంగా ఆదిత్య ఖండేష్కర్ జన్మదిన వేడుకలు
- రక్తదాన శిబిరం, కుట్టు మిషన్, వీల్ చైర్లు పంపిణీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పుట్టినరోజు సందర్భంగా సామాజిక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. మంగళవారం ఆదిత్య ఖండేష్కర్ సొసైటి అధ్యక్షుడు అధిత్య ఖండేష్కర్ తన పుట్టిన రోజును పురస్కరించుకొని రక్తదాన శిబిరం, దివ్యాంగులకు వీల్ చైర్లు, మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. దీనికి ఎంపీ అభ్యర్థి గోడం నగేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి కుట్టు మిషన్లు, వీల్ చైర్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా ఆదిత్య ఖండేష్కర్ సేవ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. పేదలు, దివ్యాంగులకు ఉపయోగపడేలా వస్తువుల పంపిణీతో పాటు అత్యవసర సమయంలో ప్రజల ప్రాణాలు కాపాడేలా రక్తదాన శిబిరం గొప్ప విషయమన్నారు. ఇలాంటి జన్మదినాలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

అనాథ పిల్లలకు చేయూత



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థులు ఈ విద్యా సంవత్సరం ముగింపు సందర్భంగా సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకున్నారు. అలాగే వారి పాకెట్ మనిని వారం రోజుల పాటు జమ చేశారు. అలాగే విద్యార్థులు జమ చేసిన డబ్బులతో కలిపి మొత్తం పాఠశాల మేనేజ్‌మెంట్‌లు కలిపి రూ.2వేల 500లను ప్రగతి ఫౌండేషన్ అనాథశ్రమం హైదరాబాద్‌కు పంపించారు. అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండ రాజేంద్రగౌడ్ మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని మనవంతు ఎంతో కొంత సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల పోషకుల సమావేశం



నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం పాఠశాల పోషకులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రావు మాట్లాడుతూ వేసవి సెలవులను విద్యార్థులు సక్రమంగా వినియోగించుకొని, మంచి చరిత్ర గల మహనీయుల పుస్తకాలను చదివి ఉన్నత శిఖరాలను ఎంచుకోవాలని విద్యార్థులను కోరారు. వేసవికాలంలో విద్యార్థులు ఎండలు తిరగడం వల్ల వడదెబ్బ సోకే ప్రమాదం ఉందన్నారు. అదేవిధంగా గ్రామ సమీపాల్లోని వాగు బావుల్లో స్నానానికి వెళ్లవద్దని విద్యార్థులను కోరారు. విద్యార్థులపై పోషకులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ ఉండాలన్నారు. ఉదయం, సాయంత్రం మంచి ఆటలను ఎంచుకొని ఆడాలని కోరారు. మానసిక ఉల్లాసం కోసం క్రీడలు కూడా అవసరమని క్రీడల్లో రాణించేందుకు విద్యార్థులకు కృషి చేయాలని కోరారు. అనంతరం అదే పాఠశాలలో పనిచేసి పదవి విరమణ పొందిన గంగాధర్‌కు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఎసీఎస్ చైర్మెన్ వాంఖడే సునంద, ఉపాధ్యాయులు వినోద్‌రెడ్డి, మురళీధర్, రాకేష్, అజయ్ కుమార్, స్వప్న, నాగేందర్, అంబాజీ, రాధిక పోషకులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఆంగ్ల భాషా దినోత్సవం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్‌లో ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఆంగ్లభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ అచ్చి శ్రీనివాస్ పాల్గొని ఆంగ్ల భాష గొప్పతనం గురించి మాట్లాడారు. దేశవ్యాప్తంగానే కాకుండా ప్రపంచవ్యాప్తంగా భావ వినిమయ సాధనంగా ఆంగ్లభాషయే ప్రధాన ఉపయోగపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో డి.దయాకర్, జాకీర్ హుస్సేన్, ఆర్.సంతోష్ కుమార్, టి.ప్రతాప్‌సింగ్, కే.రఘునాథ్, బి.ఆనందం, భువనేశ్వరి, రాజ్ కుమార్, కె.రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రధానం..

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆంగ్ల భాష దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలను ప్రకటించి, విజేతలకు బహుమతులను ప్రిన్సిపాల్ డాక్టర్ అనిత చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆంగ్ల విభాగాధిపతి ఎస్‌కె ముజీబ్ మాట్లాడుతూ ప్రస్తుత సందర్భంలో ఆంగ్ల భాష ప్రాముఖ్యత ఎలాంటిదో వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రభాత్‌రావ్, ఇంగ్లీష్ ఫ్యాకల్టీ, జాదవ్ సవిత, ఏ.సంతోషి సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. మంగళవారం ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు నామినేషన్‌కు హాజరై ఆదిలాబాద్ నుంచి ఆసిఫాబాద్‌కు తిరుగు ప్రయాణంలో లింగోజీతండాలోని, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ జాదవ్ శ్రీరామ్ నాయక్ నివాసంలో ఉట్నూర్ మండలం బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ కుమురంభీం నియోజకవర్గం ఎమ్మెల్యే కోవలక్ష్మి, రాష్ట్ర నాయకురాలు మర్సకొల సరస్వతి, లింగోజీతండా మాజీ సర్పంచ్ జాదవ్ హరినాయక్, జిల్లా నాయకులు ధరణి రాజేష్, బాబా శ్యామ్ ఉన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
బుధవారం | ఏప్రిల్ 24, 2024 | www.navatelangana.com

పూర్వ ప్రాథమిక విద్య ఎంతో ప్రధానమైనది

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పిల్లలు పాఠశాలకు అలవాటు కాకముందు పూర్వ ప్రాథమిక విద్య ఎంతో ప్రధానమైనదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సోంబాయి తెలిపారు. మండలంలోని గుండి గ్రామంలో నిర్వహించిన పూర్వ ప్రాథమిక విద్య దినోత్సవం వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులతో మాట్లాడారు. పూర్వ ప్రాథమిక



విద్య ఎంతో ప్రాధానమైనదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన విద్యతో పాటు పిల్లలకి కావాల్సిన పోషకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతినెల అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పద్మ, పెంటుబాయి, విజయలక్ష్మి, ఆశ వర్కర్ దేవిక, సెక్రెటరీ హరీష్ పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

నవతెలంగాణ-వాంకిడి



మండలంలోని సోనాపూర్ గ్రామానికి చెందిన మడావి విజయ ఇటీవల మృతి చెందగా ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి పథకం క్రింద తెలంగాణ గ్రామీణ బ్యాంకు నుండి రూ.రెండు లక్షలు మంజూరయ్యాయి. నామినిగా ఉన్న మృతురాలి తండ్రి మడావి జలపతికి బ్యాంకు మేనేజర్ విష్ణువర్ధన్ మంగళవారం బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకులో ఖాతా కలిగి ఉన్న ప్రతి ఖాతాదారులు బీమా చేయించుకొని ప్రధానమంత్రి జీవన్ జ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ రవికుమార్, అకౌంటెంట్ అనిల్, క్యాషియర్ బాబు, సీఎస్‌పీ ప్రతినిధి దుర్గం రాకేష్ పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు పార్టీలు సహకరించాలి

- జిల్లా ఎన్నికల అధికారి వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే కోరారు. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్లు దాసరి వేణు, దీపక్ తివారిలతో కలిసి ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరగనున్న లోక్‌సభ ఎన్నికలు ఎలాంటి అవాంతరాలు, ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా నిర్వహించేలా రాజకీయ పార్టీలు తమ సహకారం అందించాలన్నారు. ఈనెల 25 తర్వాత ఓటర్ల తుది జాబితా ప్రకటించనున్నట్లు తెలిపారు. శారీరక వైకల్యం కలిగిన ఓటర్లు ఫామ్-12డి నింపి వారి బూత్ అధికారికి అందజేయాలన్నారు. వారికి ఇంటి నుండి ఓటు వేసే అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు, ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలని, ఉల్లంఘనలకు పాల్పడితే భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. రాజకీయ పార్టీలు పోలింగ్ కేంద్రాలకు తమ పార్టీ తరపున ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ ఏజెంట్ల వివరాలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్ రావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మధుకర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షునిగా అల్లూరి లోకేష్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అధికారిక కాంగ్రెస్ అనుబంధ సంఘమైన ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్ష బాధ్యతలు సంఘం నాయకుడు అల్లూరి లోకేష్‌కు అప్పగిస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనక్ ప్రసాద్ ఉత్తర్వుల పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి అలాగే జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అన్ని వేళలా అందుబాటులో ఉండి జిల్లాలో కార్మికులు, కర్షకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. కార్మికులకు అన్ని వేళల్లో అందుబాటులో ఉండి పనిచేస్తానని తెలిపారు. కుమురం భీం జిల్లాలో ఉన్న సంఘటిత, అసంఘటిత సింగరేణి, ఎస్పీఎం పేపర్ మిల్, ఆర్టీసీ కార్మికులు, ప్రభుత్వ రంగ ఉద్యోగులు ఐఎన్టీయూసీకి పూర్తిగా సహకరించి సంఘాన్ని ముందుకు తీసుకుపోతారని ఆశిస్తున్నానని వారిని కలుపుకొని ముందుకు సాగుతానని తెలిపారు.

ఫలితాలు ఇస్తున్నారు..పైసలు ఇవ్వడం మరిచారు..

- నేటికీ విడుదలకాని ఇంటర్ మూల్యాంకన డబ్బులు
- అధ్యాపకుల ఎదురుచూపు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మాధ్యమిక విద్యకు సంబంధించి ఉమ్మడి జిల్లాలోని ఇంటర్మీడియట్ బోధించి మూల్యానకనంలో పాల్గొన్న ప్రభుత్వ, కాంట్రాక్ట్, ప్రయివేట్, అతిథి అధ్యాపకులు చేసిన పనికి రావాల్సిన పైసల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి దాపురించింది. గతంలో చెల్లింపులు నగదు రూపంలో ఉండేవి అప్పుడు మూల్యాంకనమైన వెంటనే అక్కడే డబ్బులు ఇచ్చి పంపించేవారు. ప్రస్తుతం అధికారులు పారదర్శకతను పెంచాలనే ఉద్దేశ్యంతో రెండు సంవత్సరాల నుండి అధ్యాపకుల ఖాతా నెంబర్లు తీసుకొని ఆన్‌లైన్‌లో బ్యాంకు ఖాతాలలో వేస్తోంది. ఇక్కడి వరకు బాగానే ఉంది. అయితే నేటికి డబ్బులు విడుదల కాకపోవడంతో ఎవరితో చెప్పుకోవాలో తెలియక అధ్యాపకులు పడుతున్న ఇబ్బందులపై ప్రత్యేక కథనం..

నేడే ఫలితాలు విడుదల..పైసలు విడుదల కాలేదు

మాధ్యమిక విద్యాశాఖాదికారులు బుధవారం పరీక్ష ఫలితాలు విడుదల చేయడానికి ఏర్పాట్లు చేశారు. అయితే అధ్యాపకులు ఫలితాల విడుదలలోపు తమ డబ్బులు విడుదల చేస్తారేమోనని వేచి చూసారు కాని వారి ఆశలు అడియాసలయ్యాయి. ఫలితాల విడుదలలో చూపిన శ్రద్ధ రెమ్యూనరేషన్ విడుదలలో చూపకపోవడంతో అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రయివేట్, గురుకుల అతిథి సిబ్బందికి రెట్టింపైన కష్టాలు

జిల్లాలో వివిధ కళాశాలలో పనిచేస్తున్న ప్రయివేట్, గురుకులాల్లో పని చేస్తున్న సిబ్బంది, ప్రభుత్వ కళాశాలలో పనిచేస్తున్న అతిథి సిబ్బందికి ఇప్పటికే అధికారుల వైఫల్యంతో ఇబ్బందులు పడుతున్నామని ఆరోపిస్తుంటే ఇంటర్మీడియట్ అధికారుల ప్రవర్తన కొత్త ఇబ్బందులు తెచ్చిపెట్టాయి. రెండు జిల్లాల్లో అతిథి సిబ్బంది 120 మందికిపైగా ఉన్నారు. వీరికి తోడు ప్రయివేట్, గురుకుల సిబ్బంది అందరూ కలిసి మరో 500 మంది ఉంటారు. వీరందరికీ వేసవిలో ఎటువంటి వేతనాలు ఉండకపోవడంతో మూల్యాంకనం ద్వారా వచ్చే డబ్బులతో కుటుంబాన్ని పోషించవచ్చనే ఆలోచన ద్వారా స్పాట్‌కు వెళ్ళిన అధ్యాపకులు నేటికి నిరాశతోనే ఉన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి తమ రెమ్యూనరేషన్ విడుదల చేయాలని కోరుతున్నారు.

రెండు జిల్లాలో 800 మంది ఎదురుచూపులు

ఇంటర్మీడియట్ అధ్యాపకులు పేపర్లు దిద్దడానికి రెండు జిల్లాల నుంచి 800 మందికి పైగా మంచిర్యాల కేంద్రానికి వచ్చినట్లు తెలిసింది. వీరిలో క్యాంప్ ఆఫీసర్‌గా డీఐఈఓ వ్యవహరించగా, ఏసీఓగా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాళ్ళు వ్యవహరించారు. అయితే చీఫ్ ఎగ్జామినర్లుగా రెగ్యులర్, కాంట్రాక్ట్ అనుభవం ఉన్న అధ్యాపకులు వ్యవహరించగా, అసిస్టెంట్ ఎగ్జామినర్లుగా, స్క్రుటినైజర్లుగా అధ్యాపకులు వ్యవహరించారు. వీరికి సగటున ఒక్కో రోజుకు రూ.700 నుండి 800 చొప్పున డిఏ, పేపర్ వాల్యువేషన్ కలిపి సగటున రోజుకు రూ.1400 వరకు వస్తుంది. ఈ లెక్కన దాదాపు రూ.10 లక్షల చెల్లించాల్సి ఉంది. గతంలో నేరుగా చెల్లింపు చేసినప్పుడు బాగుండేదని అధ్యాపకులు అభిప్రాయపడుతున్నారు.

రెమ్యూనరేషన్‌లో కోతతో ఇబ్బందులు

అసలే సరైన సమయానికి పేపర్ వాల్యుయేషన్‌కు సంబంధించి రెమ్యూనరేషన్ రాక ఇబ్బంది పడుతుంటే గత సంవత్సరం నుండి రెమ్యూనరేషన్‌లో టీడీఎస్ పేరుతో 20శాతం వరకు కోత విధించడం కొత్త ఇబ్బందులు తెస్తోంది. దీనికి సంబంధించి గత నెలలో జరిగిన పేపర్ వాల్యుయేషన్ క్యాంప్ కార్యాలయం దగ్గర అధ్యాపకులు కొంత నిరసన వ్యక్తం చేయగా ఈసారి అలా జరగకుండా చూస్తామని అధికారులు చెప్పినట్లు తెలుస్తోంది. ఏదిఏమైనా పేపర్ వాల్యుయేషన్ పూర్తయినప్పటికీ డబ్బులు రాకపోవడంపై అధ్యాపకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

దొంగతనం కేసులో ఒకరి రిమాండ్



వివరాలు తెలియజేస్తున్న ఎస్ఐ మధుకర్

నవతెలంగాణ-కౌటాల

దొంగతనం కేసులో ఒకరిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ మధూకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బోదంపెల్లి గ్రామంలో మధన పోచమ్మ ఆలయంలో ఈ నెల 16న రాత్రి సుమారు రెండు గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు గుడి తలుపులు తాళం పగులగొట్టి హుండీలో ఉన్న డబ్బులను ఎత్తుకెళ్లారు. ఆలయ పూజారి పర్ధాని పోచయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేసి సోమవారం ఉదయం మండలకేంద్రంలోని శివలింగాపూర్ గ్రామ సమీపంలో వాహనాల తనిఖీ చేపడుతుండగా బోదంపెల్లి గ్రామానికి చెందిన గుర్లె శ్రీకాంత్ అనే వ్యక్తి అనుమానస్పదంగా కనిపించాడు. అతనిని అదుపులోకి తీసుకొని విచారించగా మధన పోచమ్మ ఆలయంలో దొంగతనం చేసినట్టు ఒప్పుకున్నాడు. దొంగలించిన డబ్బులను రికవరీ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్టు ఆయన తెలిపారు.

నేడే ఇంటర్ ఫలితాలు

- తేలనున్న 10,423 మంది భవితవ్యం
- గత సంవత్సర ఫలితం నిలుపుకునేనా..?

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు రాసిన విద్యార్థుల భవితవ్యం నేడు తేలనుంది. జిల్లా వ్యాప్తంగా 10,423 మంది విద్యార్థులు 19 సెంటర్లలో పరీక్షలు రాశారు. ఫిబ్రవరి 29 నుండి మార్చి 15 వరకు పరీక్షలు జరిగాయి.

నేడు ఉదయం 11 గంటలకు ఫలితాలు

విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశ్వర్లు, ఇంటర్మీడియట్ సెక్రటరీ శృతి ఓజలు హైదరాబాద్ ఇంటర్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు ఫలితాలు విడుదల చేయనున్నారు. ఫలితాల కోసం విద్యార్థులు టీఎస్‌బీఐఈ.సీజీజీ.జీఓవీ.ఇన్ లేదా రిజల్ట్స్.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్‌లో చూడవచ్చు.

గత సంవత్సర ఫలితం నిలుపుకొనేనా..?

జిల్లాలో మొత్తం 10423 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వీరిలో మొదటి సంవత్సరం విద్యార్థులు 5423 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 5003 మంది ఉన్నారు. గత సంవత్సరం ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 82 శాతం సాధించి రాష్ట్రవ్యాప్తంగా ద్వితీయ స్థానం పొందింది. ప్రస్తుతం ఇంకా ఫలితాలు మెరుగుపరుచుకొని ముందుకు పోవాలని జిల్లా స్థాయి అధికారుల నుండి క్షేత్రస్థాయి వరకు మొదటి నుండి కృషి చేశారు. అయితే వీరి కృషి ఫలిస్తుందో లేదో చూడాలి.

తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి

సుధాకర్ నాయక్, జిల్లా డిప్యూటీ వైద్యాధికారి.



నేడు ఇంటర్ ఫలితాలు వెలువడుతున్న నేపథ్యంలో విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. వారికి ఫలితం ఎటువంటిది వచ్చిన వారిని వెన్నంటి ప్రోత్సహించాలి. అంతేకానీ వారు నిరాశ పడే విధంగా వ్యవహరించకూడదు. ఫలితం ఎలా వచ్చిన విద్యార్థులు అనుకూలంగా తీసుకోవాలి. సప్లమెంటరీలో ప్రయత్నం చేసి విజయం సాధించాలి. అంతేకానీ ఎటువంటి అనలోచిత నిర్ణయాలు తీసుకోవద్దు.

పాఠశాలలకు సెలవులు..ఇంటి బాట పట్టిన విద్యార్థులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో మంగళవారం చివరి రోజు కావడంతో విద్యార్థులు ఇంటి బాట పట్టారు. జిల్లాలోని గురుకులాల్లో వేరువేరు ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులను తీసుకువెళ్లడానికి తల్లిదండ్రులు జిల్లా కేంద్రానికి రావడంతో జిల్లా కేంద్రం రద్దీగా మారింది. విద్యార్థులు ఇంటి బాట పట్టడంతో జిల్లా కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణం విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కిక్కిరిసిపోయింది. ఏప్రిల్ 23 నుండి జూన్ 11 వరకు రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు సెలవులు ప్రకటించగా విద్యార్థులు ఇండ్లకు వెళ్లిపోయారు. తిరిగి జూన్ 12న పాఠశాలలు ప్రారంభం కానున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. చివరి రోజు కావడంతో పాఠశాలల్లో తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించారు. వేసవి కాలంలో విద్యార్థులు చేపట్టాల్సిన పనులపై వివరించారు. ఎండల తీవ్రత నేపథ్యంలో ఎక్కువగా మధ్యాహ్నం పూట బయట తిరగకూడదని సూచించారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులపై శ్రద్ధ వహించాలంటున్నారు.



విద్యార్థులకు ఇండ్లకు తీసుకెళ్తున్న తల్లిదండ్రులు

విద్యార్థుల హంగామా



నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని ఎలుకపల్లి(బి) ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మంగళవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటపాటలతో హంగామా చేశారు. పాఠశాల హెచ్ఎం ఆదిత్యారాణి, ఉపాధ్యాయుడు వినోద్ ఆధ్వర్యంలో పాఠశాలలో వీడ్కోలు పార్టీ ఏర్పాటు చేయగా విద్యార్థులు నృత్యాలు చేస్తూ హోరెత్తించారు. మంగళవారం నుంచే పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో ఆనందోత్సవాల మధ్య ఒకరినొకరు పలకరించుకుంటూ పాఠశాలల ప్రారంభంలో కలుద్దాం అంటు వీడ్కోలు పలికారు.

ఎండలో గ్యాస్ సిలిండర్‌తో జాగ్రత్త

- వేసవిలో అప్రమత్తంగా ఉండాలి
- అవగాహనతోనే నష్ట నివారణ
- ప్రమాదల నివారణకు సూచనలు పాటించాలి



ఇండ్లకు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్న గ్యాస్ సిలెండర్లు



ఇటీవల కౌటగూడలో అగ్నిప్రమాదం



ఇటీవల కౌటగూడలో అగ్నిప్రమాదం జరిగిన సంఘటనలో కాలిపోయిన ఇండ్లు

నవతెలంగాణ-చింతల మానేపల్లి

ప్రస్తుతం ఏ ఇంట్లో చూసిన గ్యాస్‌పై వంట చేయడమే కనిపిస్తోంది. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో గ్యాస్ వాడకం పెరిగింది. అయితే చాలా మందికి ఎండ కాలంలో గ్యాస్ వల్ల జరిగే ప్రమాదల గురించి తెలియదు. ప్రస్తుతం వేసవి ఎండలు దంచికొడుతున్నాయి. ఫలితంగా రోజు రోజుకూ ఎండ వేడిమి పెగుతోంది. దీంతో బయటకు రావాలంటే జనం జంకుతున్నారు. ఉష్ణోగ్రత 45 సెంటిగ్రేడ్ నమోదవుతోంది. కాగా సాధారంగా వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువ చోటు చేసుకుంటాయి. ఈ సమయంలో అగ్గి రాజుకుంటే ఏ వస్తువైనా బుగ్గి కావాల్సిందే. అందుకే నిత్యం అప్రమత్తంగా ఉండాలి. మఖ్యంగా ఇంట్లోని వంట గ్యాస్ విషయంలో సిలిండర్ వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలి. చిన్న నిర్లక్ష్యంతో అగ్ని ప్రమాదాలు జరుగుతాయి. వంట చేయడం పూర్తవ్వగానే గ్యాస్ బంద్ చేయాలి. తరుచూ సిలిండర్, స్టవ్‌ను పరిశీలించాలి. వేసవి నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'నవతెలంగాణ' ప్రత్యేక కథనం.

సిలిండర్‌తో పాటు రసీదు ముఖ్యమే..

సిలిండర్ ఇంటికి వచ్చాక రసీదులో ఉన్న ఫోన్ నంబర్లు, చిరునామా విడిగా రాసుకోవాలి. సమస్యలు వచ్చినప్పుడు ముందుగా గ్యాస్ ఏజెన్సీ వారికి ఫోన్ చేయాలి. వారు స్పందించని పక్షంలో అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. సొంత ప్రయోగాలు చేయడం ప్రమాదానికి దారి తీయవచ్చు. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక శాఖ విపత్తు నివారణ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలి. బాధితులకు సాయం చేయాలి. అత్యవసర వైద్యం కోసం ఆస్పత్రిలో చేర్పించాలి. మంటలు అదుపు చేసేందుకు అగ్నిమాపక శాఖ అధికారుల సాయం పొందాలి. గ్యాస్ సరఫరా చేసే వారే తక్కువ మొత్తానికి బీమా సౌకర్యం కల్పిస్తారు. వ్యక్తులతోపాటు ఇల్లు, ఆస్తులకు బీమా వర్తిస్తుంది.

జాగ్రత్తలు ఇలా..

వంటగదిలో సిలిండర్ నిలువుగా పెట్టాలి. సూర్యరశ్మి, వర్షపు నీరు సిలిండర్ మీద పడకుండా చూసుకోవాలి. సిలిండర్ పెట్టే స్థలం సౌకర్యంగా ఉండాలి. సిలిండర్, రబ్బర్, ట్యూబ్, రెగ్యులేటర్ మార్చడానికి వీలైనంత ఖాళీ స్థలం ఉంచాలి. సిలిండర్ దగ్గర పెట్రోల్, డీజిల్, గన్ని సంచులు, కాగితాలు ఉంచొద్దు. సిలిండర్‌కు సేఫ్టీ క్యాప్ ఉందా లేదా చెక్ చేసుకోవాలి. రెగ్యులేటర్ నుంచి తగినంత ప్రెజర్ వస్తుందో లేదో తెలుసుకోవాలి. రెగ్యులేటర్ కండిషన్‌లో ఉందో లేదో చూసుకోవాలి. ఐఎస్ఐ గుర్తింపు ఉన్న పరికరాలు వాడాలి. గ్యాస్ స్టౌవ్, రెగ్యులెటర్, ట్యూబ్, లైటర్ వరకు అన్ని నాణ్యమైనవి వాడాలి. రబ్బర్ ల్యూబ్ వడవకుండా, పగుళ్లు రాకుండా చూసుకోవాలి. సిలిండర్ కంటే గ్యాస్ పొయ్యి ఎత్తులో ఉంచాలి. తరుచూ పొయ్యిని శుభ్రం చేసుకోవాలి. సర్వీసింగ్ చేసిన తరువాత బర్నల్ సిమ్మర్ క్రమంలో ఉన్నాయో లేదో చెక్ చేసుకోవాలి. వంట గదిలో తగినంత వెలుతురు ఉండేలా చూసుకోవాలి. గ్యాస్ స్టవ్ సమీపంలో రిఫ్రిజిరేటర్ తదితర వస్తువులు ఉంచడం ప్రమాదకరం. రెగ్యులేటర్ బిగించడం సిలిండర్ నిర్వహణపై అవగాహన పెంచుకోవాలి. రాత్రి రెగ్యులేటర్ ఆఫ్ చేయాలి. గ్యాస్ డెలివరీ బాయ్ విధిగా తమతో పాటు వేయింగ్ మిషన్ తీసుకు రావాలి.

సురక్ష పైప్‌తోనే ప్రమాదాల నివారణ

దుర్గం జానకిరావు, హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ, కౌటాల



ప్రతి వినియోగదారుడు సురక్ష పైపునే వాడాలి. అది కూడా బయట మార్కెట్‌లో దొరికే పైప్‌ను వాడకూడదు. ఆయా ఏజెన్సీలలో దొరికే నాణ్యమైన సురక్ష పైపునే వాడాలి. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి తప్పకుండా వినియోగదారులు పైపును మార్చాలి. ఎక్కువగా పైప్ లీకేజి ద్వారానే ఘటనలు జరుగుతున్నందున, పైపులు తప్పకుండా మార్చాలి.

ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించండి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణక్కను చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని దరోగపెల్లి గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొయిరె బండు, మాజీ సర్పంచ్లు సంజీవ్, శ్రీనివాస్, సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.

కొప్పుల ఈశ్వర్ గెలుపునకు కృషి చేయాలి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ గెలుపునకు కృషి చేయాలని మాజీ చెన్నూర్ ఎమ్మెల్యే, మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు బాల్క సుమన్ పిలుపునిచ్చారు. మంగళవారం క్యాతనపల్లి లోని బాల్క సుమన్ స్వగృహంలో చెన్నూరు నియోజకవర్గస్థాయి యువజన, విద్యార్థి సోషల్ మీడియా వారియర్స్ తో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ కు రానున్న లోక్ సభ ఎన్నికల్లో ఈశ్వర్ గెలుపునకై దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, బెల్లంపల్లి మాజీ శాసనసభ్యులు దుర్గం చిన్నయ్య పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-దండేపల్లి



స్థానిక వ్యాపారస్తుడు రాచ శ్రీధర్ వారి పూర్వీకులు రాచ రుక్కమ్మ, రాజ లింగయ్య జ్ఞాపకార్థం మండల కేంద్రంలో చలివేంద్రంతో పాటు మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ఎండ తీవ్రత పెరగడంతో చలివేంద్రం ప్రారంభించడం అభినందనీయమని కొనియాడారు. ప్రధాన రహదారిపై ఉండడంతో బాటసారులకు ఉపయోగపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు రాచ శ్రీధర్ మాట్లాడుతూ ఎండాకాలం ముగిసే వరకు మజ్జిగ, చల్లటి నీరు పంపిణీ చేస్తామని ఎండల తీవ్రత ఎక్కువ ఉన్నందున తగు జాగ్రత్తలు అందరూ పాటించాలని సూచించారు.

కాంగ్రెస్ కార్యకర్తల సన్నాహక సభ



నవతెలంగాణ-వేమనపల్లి

మండలంలోని నీల్వాయి గ్రామంలో ఎంపీటీసీ ఆర్ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం కాంగ్రెస్ కార్యకర్తల సన్నాహక సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెద్దపల్లి పార్లమెంట్, బెల్లంపల్లి ఎన్నికల ఇన్‌చార్జి వెంకట గిరి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ సాబీర్ అలీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా గడ్డం వంశీకృష్ణను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, కేంద్రంలో రానున్న ప్రభుత్వం కాంగ్రెస్ అని ధీమా వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీలు అయిన బీఆర్ఎస్, బీజేపీ రెండు తోడు దొంగలు, అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన 100 రోజుల్లోనే ఇచ్చిన హామీలను అమలు పరుస్తున్నాం, ప్రతి పక్షాలు చేస్తున్న అబద్ధపు ప్రచారాలు పట్టించుకోవాల్సిన అవసరం లేదని ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును జీర్ణించుకోలేక పోతున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో వేమనపల్లి మండల వివిధ గ్రామ పంచాయతీల మాజీ సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపేద యువతి వివాహానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణ పరిధిలోని స్థానిక తిమ్మాపూర్‌కు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన చిలుక రాజేశ్వరి-చిన్న రాజంల కుమార్తె రమ్య వివాహనికి యువత జనం కోసం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. వివాహ ఖర్చులకు వారికి ఇబ్బందిగా ఉందని స్థానికులు తెలపడంతో దాతల దృష్టికి తీసుకువెళ్లడంతో డోనేషన్స్ ద్వారా వచ్చిన రూ.7000ను వారికి అందించారు. ఈ కార్యక్రమంలో యువత జనం కోసం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేష్, ఉపాధ్యక్షుడు వెరైటీ తిరుపతి, ప్రధాన సలహాదారు బింగి శివకిరణ్, కార్యదర్శి కరుణాకర్, కాంగ్రెస్ నాయకులు పలిగిరి కనకరాజు, గంగారపు సత్యపాల్ పాల్గొన్నారు.

విద్యార్థికి కుటుంబానికి ఉపాధ్యాయుల చేయూత

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థి కుటుంబానికి ఉపాధ్యాయులు అండగా నిలిచారు. 9వ తరగతి విద్యార్థి సమీర్ తండ్రి అనారోగ్యంతో బాధ పడుతూ ఉండగా హెచ్ఎం వెంకటేశ్వరసామి, ఉపాధ్యాయులు పుష్పలత, బండ శాంకరి, పల్లె కృష్ణ గోపాల్‌రావు, జ్యోతి, మాధవి లత, అర్చనలు కలిసి రూ.5000 నగదును ఆర్థిక సాయం అందజేశారు.

అక్రమంగా వెలిసిన షెడ్డు తొలగింపు

నవతెలంగాణ-మంచిర్యాల



షెడ్డును తొలగించిన మున్సిపల్ అధికారులు

మంచిర్యాల పట్టణంలోని అర్చన టెక్స్ చౌరస్తాలో అక్రమంగ వెలసిన షెడ్డును మున్సిపల్ అధికారులు తొలగించారు. మంగళవారం ఉదయం జేసీబీ సహాయంతో తొలగించారు. గత కొన్ని రోజుల క్రితమే షెడ్డు తీసేయాలని యజమానికి నోటీసు జారీ చేసినప్పటికీ స్పందించకోవడంతో తొలగించినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. కొందరు వ్యాపారులు ఇదే తరహాలో రోడ్ల పై షెడ్లు వేసి అక్రమంగా కిరాయిలు వసులు చేస్తున్నారని అట్టి షెడ్లపై కూడా మున్సిపల్ అధికారులు దృష్టి సారించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

నవతెలంగాణ-జన్నారం



ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ సుబ్బారాయుడు ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రిలో మహిళల కోసం నిర్వహిస్తున్న ఓపీని పరిశీలించారు. అలాగే ప్రజలకు అందుతున్న వైద్య సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ఉమాశ్రీ, ఫయాజ్ ఖాన్ పాల్గొన్నారు.

ఎంపీగా కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలి

- మాజీ ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్ రావు

నవతెలంగాణ-లక్సెట్టిపేట

మండలంలోని సూరారం గ్రామ పంచాయతీలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్ రావు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. అలాగే అసెంబ్లీ ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం..!

- అద్దె ఫార్మసీ సర్టిఫికెట్లతో మెడికల్ దందా
- నిబంధనలకు విరుద్ధంగా నిర్వహణ
- అధికారుల నిర్లక్ష్యాన్ని సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు



నవతెలంగాణ-నస్పూర్

కోల్‌బెల్ట్ ఏరియాలో మెడికల్ యజమానులు ప్రజల ప్రాణాలతో చెగాటం ఆడుతున్నారు. అవగాహన లేని నిర్వాహకులు వైద్యులు సూచించిన మందులు విక్రయిస్తున్నారు. ఫార్మసీ సర్టిఫికెట్లు అద్దెకు తీసుకుని పలు చోట్ల మెడిక్ దుఖానాలు నడుపుతున్నారు. మందుల షాప్ నిర్వహణ ఫార్మసిస్టు చూడాల్సి ఉంటుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫార్మసిస్ట్ విద్య పూర్తి చేసి వ్యక్తి మందులు విక్రయించాలి. కానీ నస్పూర్‌లో నిబందలనకు విరుద్ధంగా మెడికల్ షాపులు నడుపుతున్నారని పలు ఆరోపణలు ఉన్నాయి. ఫార్మసీ సర్టిఫికెట్‌ను అద్దెకు తీసుకొని మెడికల్ షాపు అనుమతి పొంది మెడికల్ దందా యథేచ్ఛగా సాగిస్తున్నారు. మెడికల్ వ్యాపారంలో అధిక లాభాలు ఉండడంతో షాపులను ఏర్పాటు చేసేందుకు వ్యాపారులు భారీగా ముందుకు వస్తున్నారు. ఫార్మసిస్టులకు దుకాణం ఏర్పాటు చేసుకోవడానికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో వ్యాపారులు ఇదే అదునుగా వారి సర్టిఫికేట్లను ఏడాది ఒప్పందంపై అద్దెకు తీసుకుని వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.

అద్దె సర్టిఫికేట్లతో దుఖానాలు ఏర్పాటు

ఫార్మసీ పూర్తి చేసిన వ్యక్తి వద్ద సర్టిఫికెట్‌ను ఏడాది రూ.20 నుంచి రూ.30 వేలు చెల్లించి మెడికల్ దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారూ. ఎవరి సర్టిఫికెట్‌తో అనుమతి పొంది దుకాణం నడుపుతున్నారో వారు వేరే పనులు చేసుకుంటున్నారు. దీంతో ఎలాంటి అనుబవం అవగాహన లేని వారు మెడికల్ షాపులు నడుపుతున్నారని విమర్శలు ఉన్నాయి. నస్పూర్ మున్సిపాలిటీలో సుమారుగా 80 శాతం పైగానే అద్దె సర్టిఫికెట్లతో మెడికల్ షాపులు కొన్నేళ్ల నుంచి కొనసాగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

తెలిసీ తెలియని అవగాహనతో విక్రయాలు

మందులపై కనీసం అవగాహన లేని వారు షాపులను నడుపుతున్నారు. మందుల దుకాణాలకు వెళ్లి మందుకావాలని అడిగితే ఫార్మసిస్ట్ లేకుండానే వారికి తెలిసిన మందు ప్రజలకు అంటగడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. కనీస ప్రమాణాలు పాటించని మెడికల్ నిర్వాహకులపై డ్రగ్ ఇన్స్‌పెక్టర్, సంబంధిత అధికారులు ఇలాంటి దుకాణాలను గుర్తించిన దాఖలాలు లేవని పలువురు ఆరోపిస్తున్నారు. షాపుల నిర్వాహకులు కనీసం జ్వరానికి ఎంత మోతాదులో ఉన్న మాత్రలను ఇవ్వాలనే పరిజ్ఞానం లేని వారు ప్రజలకు మందులు విక్రయిస్తున్నారు. ఇది తెలియని ప్రజలు వారు ఇస్తున్న మందులను వాడుతూ మరింత అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయి. యాంటీబయాటిక్స్ ఇష్ట రీతిన వాడరాదు. వైద్యుడి సూచన మేరకే యాంటీబయాటిక్స్ విక్రయించాలి. డీసీఏ (డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్) ప్రధాన ఉద్దేశం. మోతాదుకు మించి వినియోగంతోనే అనేక అనర్థాలకు దారి తీస్తుందని వారు అంటున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు తనిఖీలు చేపట్టి అక్రమంగా నడుస్తున్న మెడికల్ షాపులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇలాగే మందుల షాపుల వ్యవహారం కొనసాగుతుందిని ఆరోపణలున్నాయి.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం

చందన, డ్రగ్ ఇన్స్‌పెక్టర్, మంచిర్యాల

గత నెలలోనే తనిఖీలు చేపట్టాం. తనిఖీలు చేసిన వారిలో సర్టిఫికెట్ ఫార్మసిస్టులే ఉన్నారు. వైద్యులు రాసిన మందుల చీటీతోనే కొనుగోలు చేయాలి. ఒప్పంద ప్రాతిపదికన సర్టిఫికెట్ , కొనుగోలు చేసి అర్హత లేని వారు మందులు విక్రయించకూడదు. నిబంధనలను అతిక్రమిస్తే తనిఖీలు చేపట్టి వారిపై చర్యలు తీసుకుంటాం.

ఎన్నికల ఉల్లంఘన ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి

- అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్



నవతెలంగాణ-నస్పూర్

లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ చాంబర్‌లో తహసీల్దార్ శ్రీనివాస్, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సునీల్‌తో కలిసి సమీకృత కంట్రోల్ రూమ్, ఎంసీ, సి-విజిల్, సోషల్ మీడియా అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలలో భాగంగా మే 13న పోలింగ్, జూన్ 4వ తేదీన కౌంటింగ్ ఉంటాయని, జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందని, ఎన్నికల నిర్వహణ కొరకు ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేయలెన్స్, వీడియో సర్వేయలెన్స్, వీడియో పరిశీలన, సహాయ ఖర్చుల పరిశీలకులు, అకౌంటింగ్ బృందాలను నియమించి పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల సంబంధిత ఫిర్యాదుల కొరకు కంట్రోల్ రూమ్‌తో పాటు సి-విజిల్, టోల్ ఫ్రీ నెంబర్ 1950ను ఏర్పాటు చేయడం జరిగిందని, 24 గంటలు అందుబాటులో ఉంటుందని, సి-విజిల్ ద్వారా ఎన్నికల నిబంధనల ఉల్లంఘన, ఇతర ఫిర్యాదులను 100 నిమిషాల వ్యవధిలోగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రత్యేక బృందాల ద్వారా తనిఖీలు, ప్రచార కార్యక్రమాల రికార్డులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఏమైనా ఇబ్బందులు ఉన్నట్లయితే సంబంధిత ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమాచారం అందించాలని తెలిపారు. ఓటర్లను ప్రలోభపెట్టే నగదు, బంగారం, మద్యం, కానుకలు తరలింపు జరుగకుండా చెక్‌పోస్టుల వద్ద నియంత్రణ చర్యలలో భాగంగా ప్రతి వాహన తనిఖీలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారులు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీల్లో చైతన్యం రావడానికి కృషి చేయాలి



నవతెలంగాణ-మంచిర్యాల

బీసీ వర్గాల్లో చైతన్యం రావడానికి బీసీ బిడ్డలందరూ కృషి చేయాలని వివిధ బీసీ సంఘాల నాయకులు పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లాలో తొమ్మిది రోజులపాటు చేపట్టిన బీసీ చైతన్య యాత్ర నిర్వాహకులకు మంగళవారం పలు బీసీ సంఘాల ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. చైతన్య యాత్రను చేపట్టిన నాయకులు వడ్డేపల్లి మనోహర్, నీరటి రాజన్న, చిందం వెంకటేష్, కోమటి రాజు, ఎదులాపురం రాజులను సన్మానించారు. మంచిర్యాల జిల్లా బీసీ వర్గాల్లో పూలే చైతన్యం యాత్ర చేపట్టడం అభినందనీయమని అన్నారు. దేశంలో మెజార్టీ ఉన్న బీసీ వర్గాల ఆకాంక్షలను పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేధన వ్యక్తం చేశారు. మహాత్మ జ్యోతిబా పూలే, సాహు మహరాజ్, బీపీ మండల్, విశ్వనాథ్ ప్రతాప్ సింగ్‌లు అందించిన ఉద్యమ స్ఫూర్తిని బీసీ బిడ్డలు పుణికిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. సమస్త సంపదల సృష్టికర్తలైన బీసీ వర్గాలకే సమాజంలో అగ్రస్థానం దక్కాలని ఆకాంక్షించారు. మనువాదాన్ని సమూలంగా తిరస్కరిస్తేనే సమాన హక్కులు దక్కుతాయని పేర్కొన్నారు. బీహార్ తమిళనాడులో వెల్లివిరిసిన బీసీ చైతన్యం కారణంగానే నేడు ఆ రాష్ట్రాలలో రాజ్యాధికారం బీసీలకు దక్కిందని గుర్తు చేశారు. బీసీల ఆత్మాభిమానంతో వ్యవహరిస్తే మిగతా హక్కుల సైతం సంక్రమిస్తాయని అన్నారు. బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో జిల్లా వ్యాప్తంగా మరిన్ని పోరాటాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక సీనియర్ నాయకులు కనుకుంట్ల మల్లయ్య, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేషం, శ్రీరామోజు కొండయ్య, చలమల అంజయ్య, చిలగాని సుదర్శన్, బుద్దె చంద్రమౌళి, గుండేటి మధుకర్, పిట్టల రవీందర్, వేముల మల్లేష్ పాల్గొన్నారు.

బాలబాలికలకు ఖేలో ఇండియా బాక్సింగ్ కేంద్రం

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలోని 10 నుండి 20 ఏండ్ల లోపు బాలబాలికలకు జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఖేలో ఇండియా బాక్సింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి కీర్తి రాజ్వీరు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల బాలబాలికలు ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు, సాయంత్రం 4.30 గంటల నుండి 7 గంటల వరకు ఖేలో ఇండియా బాక్సింగ్ కేంద్రంలో సంప్రదించాలని, ఈ క్రీడాంశంలో చేరే వారికి ఉచిత శిక్షణ ఇస్తున్నామని, షఉస్, టి-షర్ట్స్, క్రీడా దుస్తులు, స్పోర్ట్స్ కిట్తో హాజరు కావాలని తెలిపారు. సీనియర్ క్రీడాకారులు, ఒలంపిక్ బాధ్యులు బాక్సింగ్ కేంద్రంలో చేరే విధంగా విద్యార్థినీ, విద్యార్థులను ప్రోత్సహించాలని తెలిపారు. ఇతర వివరాలకు 9963539234 నెంబర్‌లో సంప్రదించవచ్చని, ఆసక్తి గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సౌకర్యాలు లేని బడికి ఎలా పంపేది?

- పాఠశాల పేరెంట్స్ కమిటీ సమావేశంలో పలువురి ఆగ్రహం



నవతెలంగాణ-మంచిర్యాల

బడి నిండా సమస్యలు ఉన్నాయి బడిలో ఉన్న పిల్లలకు సరిపడ టీచర్లు లేరు ఇంకా పిల్లల్ని బడికి ఎట్లా పంపించమంటారు అంటూ పట్టణంలో ఉన్న ఏసీసీలో గల ప్రభుత్వ ప్రథమిక పాఠశాల పేరెంట్స్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో పలువురు అసహనం వ్యక్తం చేశారు. పాఠశాలలో బాలికలకు బాత్రూమ్స్ సౌకర్యం లేకపోవడంతో ఇంటికి వచ్చి కాళకృత్యాలు తీర్చుకొని పాఠశాలకు వెళ్తున్నారని విద్యార్థుల తల్లి తండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏసీసీ, వడ్డెర కాలని, అంబేడ్కర్‌నగర్‌లకు కలిపి ఈ పాఠశాల ఒక్కటే ఉండగా పాఠశాలలో సరిపడ స్థలం, తాగే నీరు, టీచర్‌లు లేరని దాదాపు చాలా మంది పిల్లలు బయట స్కూల్స్‌లో జాయిన్ అయినట్లు పేరెంట్స్ తెలిపారు. ప్రతి రోజు ఉదయం ప్రేయర్ చేసేందుకు కూడా సరిపడా స్థలం లేదని కమిటీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మన ఊరు మన బడి కింద పాఠశాల ఎంపిక అయినప్పటికీ పాఠశాల అభివృద్ధికి నోచుకోలేదని, అమ్మ ఆదర్శ పాఠశాల కింద రావాల్సిన నిధులు ఇప్పటికి రాలేదని పేరెంట్స్ కమిటీ సభ్యులు తెలిపారు. డీఎంఎఫ్‌టీ నిధుల కింద రూ.28 లక్షలతో పాఠశాలలో మరొక భవనం నిర్మించేందుకు నిధులు వచ్చి రెండు ఏండ్లు అయిన ఇప్పటికి భవన నిర్మాణం ప్రారంభం కాలేదని, తిరిగి పాఠశాల ప్రారంభానికి విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేరని తెలిపారు.

సింగరేణి ఉద్యోగుల పిల్లలకు ఉచిత శిక్షణ క్రీడా శిబిరం

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి ఆధ్వర్యంలో ఉద్యోగుల పిల్లలు(బాలబాలికలు) ఉచిత క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు డీజీఎం పర్సనల్ అరవిందరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అథ్లెటిక్స్, బాస్కెట్బాల్, బాక్సింగ్ క్రీడలకు శ్రీరాంపూర్ ప్రాంతంలోని ప్రగతి మైదానంలో, వాలీబాల్, ఫుట్‌బాల్ క్రీడలకు నస్పూర్‌లోని సేవా భవన్, ఆర్ అండ్ ఆర్ కాలనీలోని ప్రాణహిత స్టేడియంలో శిక్షణను అందిస్తారని తెలిపారు. క్రీడల పట్ల ఆసక్తి ఉన్న ఉద్యోగుల పిల్లల పేర్లను 26వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు ఆయా క్రీడ ప్రాంగణాలలోని నిర్వాహకుల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. పీఈటీలుగా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం కలిగి ఉన్న క్రీడాకారులు క్రీడల్లో శిక్షణ ఇచ్చినట్లయితే 25 రోజులకు వారికి గౌరవ వేతనం చెల్లిస్తామని తెలిపారు. ఆసక్తి గల శిక్షణార్తులు ఈనెల 25వ తేదీ సాయంత్రం నాలుగు గంటల లోపు శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలోని పర్సనల్ విభాగాలలో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

గనులపై బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం



నవతెలంగాణ-మందమర్రి

లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మంగళవారం కేకే-5 గని వద్ద బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు సుమన్, టీబీజీకేఎస్ స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డి మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటేసి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. హనుమాన్ జయంతి సందర్భంగా పాలచెట్టు ప్రాంతంలోని శ్రీ పంచముఖి హనుమాన్ ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. పాత బస్టాండ్ ప్రాంతంలో వ్యాపారస్తులను కలిసి బీఆర్ఎస్ ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-నస్పూర్

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జేఏసీ ఆటో యూనియన్ పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి చెల్ల విక్రం అన్నారు. జేఏసీ ఆటో యూనియన్ జిల్లా ఫైవ్ మెన్ కమిటీ ఇన్‌చార్జి పొట్ట మధుకర్, తుమ్మల వేణుగోపాల్‌రెడ్డి, మంచిర్యాల జిల్లా భీమారం చెన్నూర్ కోటపల్లి అధ్యక్షులు లక్ష్మయ్య, ఫరూక్, బండి రమేష్, సంతోష్ అధ్యక్షతన ఆటో ఓనర్స్, డ్రైవర్స్, ఆటో కార్మికుల సమావేశం నిర్వహికంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యల సాధనకై ఏప్రిల్ 24 బుధవారం రోజున తహసీల్దార్, 26న కలెక్టర్, 28న ఎమ్మెల్యేలకు వినతి పత్రం అందజేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వల్ల మహిళలు మా ఆటోలో ఎక్కడమే మానేశారని వాపోయారు. దీంతో రోజుకు రూ.200 నుంచి రూ.300 కూడా మిగలడం లేదని, రోజువారి ఫైనాన్స్, నెలవారి కిస్తీలు, అప్పులు కట్టలేక, భార్య పిల్లలను పోషించుకోలేక ఇప్పటి వరకు రాష్ట్రంలో 50 మంది ఆటో డ్రైవర్లు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మహాలక్ష్మి పథకానికి ఆటో కార్మికులు వ్యతిరేకం కాదు కానీ ఆ పథకం మాకు గొడ్డలిపెట్టుగా మారిందని, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కూడా తమను ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని తమ డిమాండ్‌ను నెరవేర్చాలని ముఖ్యమంత్రిని కోరారు.

అకాల వర్షంతో రైతుల ఇబ్బందులు

నవతెలంగాణ-కాసిపేట

మండలంలో సోమవారం రాత్రి కురిసిన అకాల వర్షంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. మల్కేపల్లి తదితర గ్రామాల్లో వరి పంట నేలకు ఒరిగింది. దీంతో పాటు లంబాడితాండ, దుబ్బగూడెం మామిడితోటల్లో మామిడిపండ్లు నేలరాలాయి. గ్రామాల్లో చెట్లు కింద పడిపోయాయి.

అకాల వర్షాలతోనే కరెంటు కోతలు

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



అకాల వర్షాలతోనే కరెంటు కోతలున్నాయని సిర్పూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలతోనే కరెంటు కోతలు ఉన్నట్టు తెలిపారు. విద్యుత్ కోతలపై సంబంధిత విద్యుత్ డీఈని సంప్రదించగా అకాల వర్షాలతో గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో వాటి మరమ్మత్తుల కోసం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. కరెంటు కోతలపై అసత్యపు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నార్ల తిరుపతి, పెంచికల్‌పేట్ మండల అధ్యక్షుడు బొయిరె బండు, మాజీ సర్పంచ్లు సుధాకర్, సంజీవ్, శ్రీనివాస్, నాయకులు సముద్రాల రాజన్న, సాజిద్, లచ్చన్న, తిరుపతి పాల్గొన్నారు.

నేడు జిల్లాకు కేంద్ర విదేశాంగ మంత్రి రాక

- నామినేషన్ వేయనున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీజేపీ ఎంపీ అభ్యర్థి నామినేషన్ ఈనెల24న వేయనున్నట్లు, దీనికి కేంద్ర విదేశాంగ మంత్రి శివశంకర్, ఓబీసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ ముఖ్యఅథితులుగా రానున్నారని ఎమ్మెల్యే పాయల శంకర్ తెలిపారు. మంగళవారం రాంలీలా మైదానంలో ఏర్పాట్లను ఎంపీ అభ్యర్థి నగేష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ మాట్లాడుతూ నామినేషన్ వేయడానికి ర్యాలీగా వెళ్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు రాంలీలా మైదానం నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ వేయడం జరుగుతుందన్నారు. పార్టీ కార్యకర్తలు, శ్రేణులు, అభిమానులు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రమేష్ రాథోడ్, అశోక్ ముస్తాపూరే, అంకత్ రమేష్, లాలమున్న, ఆకుల ప్రవీణ్, రాష్ట్రపాల్, ముకుంద్, అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యుద్ఘాతానికి గురై రెండు ఎడ్లు మృత్యువాత

నవతెలంగాణ-ఉట్నూర్



విద్యుత్ తీగలు తగిలి రెండు ఎడ్లు మృత్యువాత పడ్డ సంఘటన ఉట్నూర్ మండలంలోని మోతీరాంగూడ గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మెస్రం మంగుకు చెందిన రెండు ఎడ్లకు విద్యుత్ తీగలు తగలడంతో అవి అక్కడికి అక్కడే మృత్యువాత పడ్డాయి. వాటి విలువ సుమారు రూ.1.10లక్షలు ఉంటుదని తెలిపారు. ప్రభుత్వం తన ఆదుకోవాలని కోరారు.

ఆరో రోజు ఆరు నామినేషన్ల దాఖలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

లోక్ సభ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి సంబంధించి మంగళవారం ఆరో రోజు ఆరు నామినేషన్లు దాఖలు అయినట్టు జిల్లా రిటర్నింగ్ అధికారి రాజర్షిషా ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సక్కు ఒక సెట్ల నామినేషన్‌లు దాఖలు చేసినట్టు పేర్కొన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు తరపున రెండవ సెట్ నామినేషన్ దాఖలను ఎమ్మెల్సీ దండే విఠల్, నాయకులు జాన్సన్ నాయక్, లోలం శ్యాంసుందర్, రామ్ కిషన్‌రెడ్డి, మర్సకోల సరస్వతి వేసినట్లు పేర్కొన్నారు. ఇండియా ప్రజాబంధు పార్టీ తరపున గేడం సాగర్ రెండు సెట్ల నామినేషన్ వేశారని తెలిపారు. స్వతంత్ర అభ్యర్థులుగా మెస్త్రం గంగాదేవి, చవాన్ రాము ఒక్కో సెట్ వేసినట్లు పేర్కొన్నారు. వీరు కలెక్టర్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన ఆర్ఓ కార్యాలయంలో దాఖలు చేసినట్టు పేర్కొన్నారు.

పాఠశాలలకు సిమ్ కార్డుల పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు సిమ్ కార్డులను జిల్లా సెక్టోరల్ అధికారి జే.నారాయణ మంగళవారం పంపిణీ చేశారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలో ట్యాబ్‌లు మంజూరు చేసిన 541 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు సిమ్ కార్డులు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. దీనితో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు డిజిటల్ విద్య కొంతవరకు అందుబాటులోకి రావడంతో పాటు ప్రధానోపాధ్యాయులు పాఠశాల నివేదికలు ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు పై అధికారులకు అందించడానికి వీలవుతుందని తెలిపారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ప్రచార రథం ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ ప్రచార రథాన్ని మంగళవారం ప్రారంభించారు. పట్టణంలోని దుర్గానగర్‌లోని దుర్గామాత ఆలయంలో ప్రచార రథానికి తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు చేసి రథాన్ని ప్రారంభించారు. అనంతరం ఆదిలాబాద్ పట్టణంలోని రామ్‌నగర్ రామాలయం, దస్నాపూర్ హనుమాన్ దేవాలయం, విద్యానగర్ హనుమాన్ దేవాలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుడిపెల్లి నగేష్, లింగన్న, దుర్గ నాని, గోవింద్, బండి దేవిదాస్ చారి, శాంతన్ రావు, లోక ప్రవీణ్‌రెడ్డి, గంగారెడ్డి, విద్యానగర్ కౌన్సిలర్ శ్రీనివాస్, నాగరాజు, వెంకటేష్, రంజిత్, అడెల్లు, శ్రీలేఖ, లత, ఆశమ్మ లక్ష్మి, జుబేధ, సోని, సంగీత పాల్గొన్నారు.

సుభాష్‌నగర్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ విస్తృత ప్రచారం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మంగళవారం సుభాష్‌నగర్ కాలనీలో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ హామీల పత్రాలను పంచుతూ, స్టిక్కర్లు అందజేస్తూ చెయ్యి గుర్తుకు ఓటు వేయాలంటూ ఓటర్లను అభ్యర్థించారు. ఒక పేదింటి ఆదివాసీ బిడ్డకు ఒక అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి మాట్లాడుతూ ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని అన్నారు. తనను గెలిపిస్తే వెనుకబాటుకు గురైన ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రజల కష్టసుఖాల్లో తోడుంటానని భరోసా కల్పించారు. పేదల బాధలు తెలిసిన వ్యక్తిగా ఎల్లవేళలా అండగా ఉంటానని అన్నారు. ప్రజల ఆశీర్వాదం తనకు కావాలని, వారి సమస్యలపై చట్టసభల్లో గొంతెత్తి నినదిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ దర్శనాల లక్ష్మణ్, ఎస్సీ సెల్ చైర్మెన్ రాహుల్ చంద్రాల, నాయకులు కొండ గంగాధర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్‌రావు, లోక ప్రవీణ్‌రెడ్డి, డి.శ్రీలేఖ ఆదివాసీ, మైనార్టీ నాయకులు రషీద్ ఉల్‌హక్, ఎంఏ.షకీల్, రఫిక్, అజీం, ఉయిక ఇందిర పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

పార్లమెంట్ ఎన్నికలకు మూడు రోజులు ముందే పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో వసతులు కల్పించేలా చర్యలు చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని కోసిని పాఠశాల పోలింగ్ కేంద్రంలోని మౌళిక వసతులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు సరఫరా, గదుల్లో ఫ్యాన్లు, మరుగుదొడ్లు, ర్యాంపులు ఉండాలన్నారు. ఏ ఒక్కటి లోటు కన్పించిన బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శులు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. ఆయన వెంట తహసీల్దార్ కిరణ్ కుమార్, ఎంపీడీఓ రమేష్, ఎంపీఓ గౌరీశంకర్, ఎంఆర్ఐ కలీల్, ఏపీఓ సోహెబ్, పంచాయతీ కార్యదర్శి సలీం ఉన్నారు.

ఆదివాసులకు రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

- మాజీ మంత్రి జోగు రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



బీఆర్ఎస్ ఎంపీ ఆదివాసీ అభ్యర్థిపై సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలను ఖండిస్తున్నట్టు మాజీ మంత్రి జోగు రామన్న తెలిపారు. ఆదివాసులకు సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జోగు రామన్న మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపిస్తే పలు పథకాలు అమలు చేస్తామని మాట ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం పార్లమెంట్‌లో గెలిపిస్తేనే వాటిని అమలు చేస్తామని మాట మార్చడం వారి చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన జనజాతర సభలో ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ ఎంపీ ఆదివాసీ అభ్యర్థిని అవమానపరిచే విధంగా పరుష పదజాలాన్ని వాడారని, వెంటనే ఆదివాసీ సమాజానికి ముఖ్యమంత్రి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీని బడే భాయ్ అంటూ సంభోధించిన వ్యక్తి, ఎన్నికల వేళ విమర్శలు చేయడం దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి లోపల బీజేపీ, బయట కాంగ్రెస్ అన్న విషయం జన జాతర సభతో స్పష్టమయిందని అన్నారు. రైతు భరోసా కింద పదిహేను వేల రూపాయల ఆర్థిక సాయం, రైతుకూలీలకు ఆర్థిక సాయం, నాలుగు వేల పెన్షన్, కళ్యాణ లక్ష్మి కింద తులం బంగారం వంటి హామీలను బుట్టదాఖలు చేశారని మండిపడ్డారు. హామీలను ఎందుకు అమలు చేయడం లేదో ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత సీఎం పై ఉందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపిస్తేనే హామీలను అమలు చేస్తామంటూ ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసేలా వ్యాఖ్యలు చేశారని, ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తోందన్న విషయం గ్రహించే ప్రజలు సైతం అనుకున్న సంఖ్యలో సభకు హాజరు కాలేదని, ముందుగానే ఓటమిని గ్రహించి కేసీఆర్‌పై విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి ఎంపీ అభ్యర్థిని అవమానించే విధంగా వ్యాఖ్యలు చేశారని అన్నారు. ఇంద్రవెల్లిలో అమాయక ఆదివాసులను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమే పొట్టన పెట్టుకుందని, ప్రస్తుతం ఇంద్రవెల్లిని పర్యాటక కేంద్రంగా మారుస్తామని మాయమాటలు చెప్తున్నారని ధ్వజమెత్తారు. ముందుగా ఎందరు బలయ్యారో వారి కుటుంబాలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి దూరహంకారనికి ప్రజలు ఓటు ద్వారానే బుద్ధి చెప్తారని స్పష్టం చేశారు. 50 సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో సీసీఐ, ఎయిర్ పోర్ట్, రైల్వే లైన్ వంటి అంశాలను విస్మరించి, ప్రస్తుతం గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. సీసీఐని ప్రభుత్వం తరపున నడిపిస్తామని తమ బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ముందుకు వస్తే, ప్రయివేటుకు అప్పగిస్తామని సీఎం వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. ఆదివాసీ గూడాలు, తండాల్లో కనీస సౌకర్యాలు కల్పించిన ఘనత తమ బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని, ఈ విషయమై ఆయా ప్రాంతాల్లో పర్యటించేందుకు సైతం సిద్ధమని సవాల్ విసిరారు. త్వరలోనే మాజీ సీఎం కేసీఆర్ బస్సు యాత్రలు, బహిరంగ సభలు ప్రారంభం కానున్నాయని, ఊరు వాడా బీఆర్ఎస్‌కు ప్రజల నుంచి బ్రహ్మరథం లభిస్తోందని అన్నారు. సమావేశంలో నాయకులు ఇజ్జగిరి నారాయణ, యూనిస్ అక్బాని, సాజిదోద్దీన్, యాసం నర్సింగ్‌రావు, సలీం పాషా, భూమన్న, పర్వీన్ పాల్గొన్నారు.

బావర్చి హోటల్లో ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు

- శాంపిల్స్ సేకరించి, ల్యాబ్‌కు తరలింపు
- పరిశుభ్రత విషయంలో రూ.25 వేల జరిమానా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హోటళ్ల నిర్వాహకులు నిబంధనలను తప్పకుండా పాటించడంతో పాటు పరిశుభ్రత విషయంలో జాగ్రత్తగా ఉండాలని మున్సిపల్ కమీషనర్ ఖమర్ అహ్మద్ సూచించారు. పట్టణంలోని బిగ్ బావర్చి హోటల్‌లో బిర్యానిలో బొద్దింక వచ్చిందన్న వార్తా కథనాలకు అధికారులు స్పందించారు. ఆహార భద్రత అధికారి డాక్టర్ మెటొపెల్లివార్ శ్రీధర్‌తో పాటు పలువురు అధికారులు మంగళవారం హోటల్‌లో తనిఖీలు నిర్వహించి, నమూనాలు సేకరించారు. భోజనం తయారు చేసే గది, వంటలకు వినియోగిస్తున్న వస్తువులు, వాటి నాణ్యత ఇతరత్రా అంశాలపై వివరాలను సేకరించారు. వంటకాల నమూనాలను సేకరించి, హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించారు. పరిశుభ్రత విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించనందున రూ.25వేల జరిమానా విధించారు. మున్సిపల్ కమీషనర్ ఖమర్ అహ్మద్ మాట్లాడుతూ హోటల్ యజమానులు విధిగా నిబంధనలను పాటించాలని సూచించారు. బావర్చి హోటల్‌పై వచ్చిన కథనాలకు స్పందించి తనిఖీలు చేపట్టడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా ఆహార భద్రత అధికారి డాక్టర్ మెటొపెల్లివార్ శ్రీధర్ మాట్లాడుతూ హోటళ్ల నిర్వాహకులు తప్పకుండా ఎఫ్ఎస్ఎస్ఏ లైసెన్స్ తీసుకోవాలని అన్నారు. హోటల్ పరిశుభ్రత విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించనందున జరిమానా విధించడం జరిగిందన్నారు. హైదరాబాద్ ల్యాబ్‌కు పంపిన నమూనాల ఫలితాలు వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో శానిటరీ ఇన్స్‌స్పెక్టర్ నరేందర్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఫుడ్ సేఫ్టి సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి సందర్భంగా కబడ్డీ పోటీలు

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని కోసాయిలో పురాతన హనుమాన్ దేవాలయంలో మంగళవారం హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జయంతి సందర్భంగా అక్కడ కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం తిరుమల స్టోన్ క్రషర్ వద్ద గల హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రుయ్యాడి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ కన్వీనర్ కళ్యాణం రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ బొల్లారం బాబన్న, మాజీ సింగిల్ వీండో చైర్మెన్ ప్రకాష్‌రావు, మాజీ సర్పంచ్ సుభాష్, లోక ప్రవీణ్‌రెడ్డి, వెంకటేష్, రమాకాంత్, గంగన్న, దొంతుల ఇస్తారి, దత్తు, ప్రహ్లాద్ క్రీడాకారులు భక్తులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఓటర్ స్లిప్పుల పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఏప్రిల్ 25 నుంచి ఓటర్ స్లిప్పుల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్టు రిటర్నింగ్ అధికారి రాజర్షిషా తెలిపారు. మంగళవారం అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి పంపిణీకి ఏర్పాట్లను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి ఓటర్ స్లిప్ పంచడంతో పాటు ఓటర్ గైడ్‌ను కూడా అందించాలన్నారు. గ్రామాల్లో, మున్సిపాలిటీలో బూత్ స్థాయి అధికారులు ఓటర్ స్లిప్పులు పంపిణీలో నిర్లక్ష్యం వహించకుండా ప్రతి ఓటర్‌కు అందేలా బాధ్యతగా పని చేయాలని సూచించారు. ఎన్నికల పర్యవేక్షణలో భాగంగా సెక్టోరల్ అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు. పార్లమెంటు ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు గ్రామాల్లో, మున్సిపాలిటీలలోని పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసుకునేందుకు సన్నద్ధం కావాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో విద్యుత్తు అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్తు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని పోలింగ్ కేంద్రాల్లో మంచినీరు, టెంట్లు సమకూర్చుకోవాలని సూచించారు. వయోవృద్ధులు, వికలాంగ ఓటర్ల సదుపాయ నిమిత్తం వీల్ చైర్లను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. మున్సిపల్, పంచాయతీ అధికారులు సమన్వయంతో ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు ఎన్నిక సామాగ్రిని చేరవేసేందుకు వీలుగా వాహనాలను సమకూర్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా, జిల్లా అధికారులు, ఎంపీడీఓలు ఉన్నారు.

ఆదివాసుల సమస్యల పరిష్కారానికి సభ ఏర్పాటు



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదివాసుల సమస్యల పరిష్కారానికి సభను మావల మండలంలోని కుమురంభీం కాలనీలో 25న గురువారం ఏర్పాటు చేస్తున్నట్టు తుడుం దెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహణ అధ్యక్షుడు గోడం గణేష్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 25న కుమురంభీం కాలనీలో తుడుందెబ్బ, తెలంగాణ జేఏసీ ఆధ్వర్యంలో సభను ఏర్పాటు చేస్తున్నామని దీనికి ప్రొఫెసర్ కోదండ రామ్ ముఖ్యఅతిథిగా హజరవుతున్నారని అన్నారు. ఈ సభకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రజా సంఘాల నాయకులు, ఆదివాసీ సంఘాల నాయకులు, రాయిసెంటర్ సార్మేడీలు, గ్రామపటేల్, మహాజన్, యువజన విద్యార్థి, మహిళా, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఆదివాసీ కార్మిక కర్షక వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టీపీజేఏసీ జిల్లా అధ్యక్షులు ఆరెపెల్లి విజయ్ కూమార్, సామాజిక కార్యకర్త బాలినేని అజయ్, టీఎస్ మైనార్టీ నాయకులు వాజిద్‌ఖాన్, జేఏసీ జిల్లా నాయకులు జె.సుదర్శన్, తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, మహిళా సంఘం డివిజన్ అధ్యక్షురాలు సోయం లలితబాయి, కుమురం భీం కాలనీ నిర్వాణ కమిటీ సభ్యులు చాకటి అనసూయబాయి, భుజంగరావు, మావల మండల అధ్యక్షుడు వెడ్మ ముకుందరావు, సోయం భీంరావు, కొట్నాక్ భారత్ పాల్గొన్నారు.

జిల్లాలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో హనుమాన్ జయంతి వేడుకలు మంగళవారం అంబరాన్నంటేలా సాగాయి. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో హనుమాన్ ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దారు.జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ధర్మపురి వెంకటేశ్వర్, కమిటీ సభ్యులు పిన్న వివేక్, గుండా వెంకన్న, రూప్నర్ రమేష్‌తో పాటు ఇతర సభ్యుల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు శిరీష్ శర్మ మహేష్, శ్రీనివాసరావుతో కూడి పదిమంది అర్చకులు ఆలయ ఆవరణలో హోమం నిర్వహించారు. ఆలయంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్, నాయకులు మర్సకోల సరస్వతి, మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గౌడ్, చిలువేరి వెంకన్న దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రచార కార్యదర్శి చిలుకూరి రాధాకృష్ణ చారి, తుజాలపూర్ మురళీధర్ గౌడ్, ఏకీరాల శ్రీనివాస్ సతీష్, చెట్ల రాజు, డాక్టర్ మధు, రూపనర్ రమేష్, సుధాకర్, లక్ష్మణ మూర్తి పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయాల్లో అన్నదానాలు

కేస్లాపూర్ ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఆలయానికి వచ్చిన భక్తులందరికీ చల్లటి నీటిని సాయిని సంతోష్ దంపతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్, మధు భక్తులు పాల్గొన్నారు. ఏఆర్ హెడ్ క్వార్టర్స్ వెనకాల ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వాంకిడి : మండల కేంద్రంలోని హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఉదయం నుండే భక్తులు బారులు తీరి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే మండలంలోని ఇందానీ, కమాన, కిర్డీ, బెండారా, బంబారా తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం మండలకేంద్రంలోని హనుమాన్ ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పెంచికల్‌పేట్ : హనుమాన్ జయంతి సందర్భంగా మండలంలోని గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మండలకేంద్రంలోని శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహం వద్ద జెడ్పీటీసీ సముద్రాల సరిత రాజన్న ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, బీజేపీ నాయకులు పాల్వాయి సుధాకర్‌రావు, సిర్పూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ పూజలో పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రధీన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. అంతకు ముందు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఇందులో మాజీ సర్పంచ్లు సుధాకర్, సంజీవ్, శ్రీనివాస్, ఈశ్వరి, కావ్య, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బెజ్జూర్ : మండలంలో మంగళవారం హనుమాన్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా యువకులు జై శ్రీరామ్, జై హనుమాన్ అంటూ నినాదాలు చేస్తూ బెజ్జూర్ నుండి ఎలుకపెల్లి, సిద్ధాపూర్, నాగుల్వాయి, ఏటిగూడ గ్రామాల్లో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఆయా ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో హనుమాన్ జెండాలు ఎగరవేశారు. మూలవిరాట్ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

తలమడుగు : మండలంలోని సుంకిడి గ్రామ సమీపంలోని తిరుమల స్టోన్ క్రషర్ వద్ద గల హనుమాన్ ఆలయంలో మంగళవారం స్టోన్ క్రషర్ యాజమాన్యం హనుమాన్ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల మధ్య హోమం నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో తిరుమల స్టోన్ క్రషర్ యాజమాన్యం గుట్ట హనుమండ్లు, ప్రవీణ్, నవీన్, సుమన్, కుటుంబ సభ్యులతో పాటు బంధుమిత్రులు భక్తులు, సుంకిడి, లింగి, కుచులాపూర్, లాల్‌గడ, లక్ష్మీపూర్, ఉండం మహారాష్ట్ర వాసులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్ : నర్సాపూర్ (జి) మండలంలోని ఆయా గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని వీర హనుమాన్ మందిరం బోయవాడ హనుమాన్ మందిరంలో మంగళవారం హనుమాన్ జయంతి సందర్భంగా నూతన జెండాలను ఆవిష్కరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చిన్న రామయ్య, ఎంపీటీసీ మల్లేష్, నాయకులు పాల్గొన్నారు.

ఉట్నూర్ : మండలంలోని బోయవాడ, పాత ఉట్నూర్, శాంతినగర్, లక్కారం గ్రామాల్లో మంగళవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ మండల నాయకులు, కార్యకర్తలతో కలిసి హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. జెండాను ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, వైస్ ఎంపీపీ, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు ఆంజనేయస్వామి భక్తులు, నాయకులు పాల్గొన్నారు.

బోథ్ : సేవలాల్ జగదంబదేవి ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని సాకేర గ్రామంలో నిర్వహించిన హనుమాన్ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గ ప్రజలకు హనుమాన్ జయంతి శు భకాంక్షలు తెలిపారు. అలాగే భగవంతుని ఆశీర్వాదాలు ప్రజలందరి పైన ఉండాలని రాబోయే ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు సంవృద్ధిగా పడి రైతులందరికీ మంచి పంటలు పండి లాభాలు చేకూరాలని కోరారు. అలాగే గ్రామంలోని ఆలయ నిర్మాణంతో పాటు సీసీ రోడ్లను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుల శ్రీనివాస్, జెడ్పీటీసీ సంధ్యారాణి, గ్రామ పెద్దలు బాబా నాయక్, రవీందర్, నాయకులు సురేందర్ యాదవ్, రుక్‌మన్ సింగ్, రాజేశ్వర్, మెడిచల్మ ప్రవీణ్, భీమ్ రావు, భిక్కులాల్, రామారావ్, సంతోష్, రాయల్, శ్రావణ పాల్గొన్నారు.

జైనథ్ : మండలంలోని పెండల్‌వాడ గ్రామంలో వెలిసిన ప్రసిద్ధ హనుమాన్ ఆలయాన్ని ఎమ్మెల్యే పాయల శంకర్, మాజీ ఎంపీ రాథోడ్ రమేష్, బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్‌తో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ, శాంతులతో వర్ధిల్లాలని, హనుమంతుడి చల్లని దీవెనలు అందరిపై ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ఎన్నికల కోఇన్‌చార్జ్ అశోక్ ముస్తాపురే, స్థానిక బీజేపీ నాయకులు అశోక్, విశాల్, విలాస్, రాజు ముకుందరావు, భూమన్న పాల్గొన్నారు. అంతకుముందు నాయకులు మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న బీఆర్ఎస్ నాయకులతో కలిసి హనుమాన్ ఆలయాన్ని సందర్శించుకున్నారు.